




www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 03RD APRIL 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 08 ISSUE : 361 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 03 ఏప్రిల్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 361 వెల : రూ.3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## 16 నుంచి మళ్లీ పార్లమెంట్

- మూడు రోజుల పాటు నిర్వహణ
- మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం
- ఆగమేఘాలపై మహిళా బిల్లు ఎందుకు పెడుతున్నారు: కాంగ్రెస్

➢ 2వ పేజిలో..

# 99 రోజుల కార్యాచరణతో గ్రామస్థాయి సమస్యల పరిష్కారం

- ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వానికి మార్గదర్శకం
- ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం
- సంక్షేమం--అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు
- తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంతో ముందుకు



హైదరాబాద్, ఏప్రిల్ 2 (అక్షరం న్యూస్))ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు కొనసాగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలకు ప్రత్యేక సందేశం అందించారు. ప్రజల ఆకాంక్షలే ప్రభుత్వానికి మార్గదర్శకమని, సేవాభావంతో పాలన కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడునెలలు పూర్తయ్యాయని, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమంలో ఎటువంటి రాజీ పడకుండా పనిచేస్తున్నామని తెలిపారు. గత పాలనలో జరిగిన లోపాలను సరిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. ప్రజల మద్దతుతో జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో విజయాలు సాధించామని తెలిపారు. ఈ ఫలితాలు ప్రభుత్వంపై బాధ్యతను మరింత పెంచాయని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

"ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని మార్చి 6 నుంచి ప్రారంభించి 99 రోజుల పాటు ఉద్యమంలా నిర్వహిస్తున్నామని చెప్పారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని శాఖల సమన్వ యంతో సమస్యల

➢ మిగతా 2వ పేజిలో..



## కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

- కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం
- ఎటిఎంలా ప్రాజెక్టు వాడుకున్న కెసిఆర్
- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కెసిఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,ఏప్రిల్2 (అక్షరం న్యూస్) రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాలేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాలేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాలేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి

➢ మిగతా 2వ పేజిలో..

## ఏడు మండలాల అప్పగింత బిజెపి పుణ్యమే

- పార్లమెంట్ సాక్షిగా అబద్దాలు
- వికృతత్వాన్ని బయటపెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



హైదరాబాద్,ఏప్రిల్2 (అక్షరం న్యూస్) తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది

➢ మిగతా 2వ పేజిలో..



## గ్రూప్-1 నియామకాలకు గ్రీన్ సిగ్నల్

- సుప్రీంకోర్టు పిటిషన్లను కొట్టివేత
- హైకోర్టు ఉత్తర్వులకు మద్దతు
- అభ్యర్థులపై ఆరోపణలకు చెక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (అక్షరం న్యూస్) టీజీపీఎస్సీ నిర్వహించిన 563 గ్రూప్-1 పోస్టుల నియామకాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను

➢ మిగతా 2వ పేజిలో..

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత



హైదరాబాద్,ఏప్రిల్2 (అక్షరం న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్ట కొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం

➢ మిగతా 2వ పేజిలో..

## లొంగేవరకు యుద్ధం కొనసాగుతుంది

- అమెరికా వ్యాఖ్యలకు ఇరాన్ కౌంటర్
- సైనిక బలం దెబ్బతినలేదని ఇరాన్ స్పష్టం
- ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన టెహ్రాన్



టెహ్రాన్, ఏప్రిల్ 2 అమెరికా తమకు లొంగిపోయేవరకు యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ ఘాటుగా హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందిస్తూ, తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన విడుదల చేయగా, అధికారిక మీడియా ప్రసారం చేసింది.ఇరాన్ నౌకాదళం, వాయుసేన బలహీనపడ్డాయని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను టెహ్రాన్

➢ మిగతా 2వ పేజిలో..

## ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ కేటాయింపు

- భూభారతి పోర్టల్‌తో భూమి సేవలకు కొత్త దిశ
- 45 రోజుల తర్వాత జిల్లాకో మండలంలో అమలు
- సాదాబైనామాలకు త్వరిత పరిష్కారం లక్ష్యం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రంగారెడ్డి, ఏప్రిల్ 2 రాష్ట్రంలో భూమి, సర్వే, రిజిస్ట్రేషన్ సేవలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి, అవసరమైన మార్పులు చేసి జిల్లాకో మండలంలో అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం

➢ మిగతా 2వ పేజిలో..

# లొంగేవరకు యుద్ధం కొనసాగుతుంది

➢ మొదటి పేజి తరువాయి

ఖండించింది. తమ సైనిక వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయని, వ్యూహాత్మక సామర్థ్యం యథాతథంగా ఉందని పేర్కొంది. అమెరికా చేసిన ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని తెలిపింది.అమెరికా తమ సైనిక మౌలిక వసతులను ధ్వంసం చేసిందన్న వాదనలను కూడా ఇరాన్ తిరస్కరించింది. తమ వద్ద ఆధునిక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, గగనతల రక్షణ వ్యవస్థలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించింది. అమెరికా నిఘా వర్గాలకు తమ పూర్తి సామర్థ్యాలపై సరైన సమాచారం లేదని పేర్కొంది. అమెరికా చర్యలను ఇరాన్ తీవ్రంగా విమర్శించింది. ఆధునిక యుగంలోనూ మానవత్వానికి విరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని ఆరోపించింది. చిన్నారుల హత్యలు, అమానుష చర్యలు జరుగుతున్నాయని ఆరోపణలు గుప్పించింది.యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, తమ లక్ష్యాల్లో ఎలాంటి మార్పు లేదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి లొంగేవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపింది. ఇరాన్ చేసిన ఈ ప్రకటనతో అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశముంది. పరిస్థితులను శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రపంచ దేశాలు ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ కేటాయింపు

➢ మొదటి పేజి తరువాయి

మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఆయన ఈ పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఆమనగల్‌తో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ఈ పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా ప్రజలు ఎటువంటి కార్యాలయాలకు వెళ్లకుండా తమ స్మార్ట్ ఫోన్ ద్వారానే అన్ని సేవలను పొందవచ్చని మంత్రి తెలిపారు. భూమికి సంబంధించిన రికార్డులు, నమోదు, సర్వే వివరాలు ఒకే వేదికలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అవినీతి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.గతంలో అమలైన విధానాల కారణంగా 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సాగులో ఉన్న భూములపై హక్కులను ధృవీకరించి, అర్హులకే పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలు మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాల్లో కూడా ఈ విధానం వర్తించేలా మార్పులు చేస్తున్నామని చెప్పారు.భూమి వివరాలకు ఆధార్ తరహాలో ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం, వేలాది సర్వేయర్లకు శిక్షణ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆధునిక సాంకేతికతతో సర్వే నిర్వహణ కోసం రోవర్ పరికరాలను వినియోగిస్తున్నామని తెలిపారు.పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. గత పాలనలో జరిగిన లోపాలను సరిదిద్దుతూ ప్రజలకు సులభమైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. త్వరలో ఈ నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

# 16 నుంచి మళ్లీ పార్లమెంట్

- మూడు రోజుల పాటు నిర్వహణ
- మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం
- ఆగమేఘాలపై మహిళా బిల్లు ఎందుకు పెడుతున్నారు: కాంగ్రెస్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను కల్పించే నారీ వందనా అధినియమ్‌ను ప్రవేశపెట్టాలన్న కృతనిశ్చయంతో ఉన్న మోదీ ప్రభుత్వం ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు పార్లమెంట్ ఉభయ సభలను మళ్లీ సమావేశపరచాలని నిర్ణయించింది. గురువారం సాయంత్రం ఉభయ సభలు ప్రోరోగ్ కావడానికి బదులు వాయిదా పడ్డాయి. తాము బడ్జెట్ సమావేశాలనే ప్రస్తుతం వాయిదా వేసి మళ్లీ రెండు మూడు వారాల్లో ప్రారంభించాలనుకుంటున్నామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు గురువారం తెలిపారు. బడ్జెట్ సమావేశాలను మళ్లీ సమావేశపరుస్తారా అని కాంగ్రెస్ నేత జైరాంరమేశ్ రాజ్యసభలో అడగడంతో ఆయన ఈ విషయం వెల్లడించారు. కేవలం రాజకీయ కారణాల వల్లే మహిళా బిల్లును ఆగమేఘాలపై ప్రవేశపెడుతున్నారని, ఎన్నికల కోడ్‌కు ఇది విరుద్ధమని జైరాంరమేశ్ వ్యాఖ్యలను ఆయన తోసిపుచ్చారు. 30 నెలలుగా ఈ విషయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదని, జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతామన్నవారు ఇప్పుడెందుకు ఆ బిల్లును తేవాలనుకుంటున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిలదీశారు. కాగా ఎన్నికలైన తర్వాత తాము అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖ రాసిన విషయం ఖర్గే ప్రస్తావించగా అలా సాధ్యం కాదని కిరెణ్ రిజిజు చెప్పారు. ప్రజలకిచ్చిన వాగ్దానం నెరవేర్చడమే తమ కర్తవ్యమని, దానికీ ఎన్నికలకూ సంబంధం లేదన్నారు. ఈ బిల్లును ఇక ఆలస్యం చేయవద్దని తాము ప్రార్థిస్తున్నామని చెప్పారు. కాగా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని ఎప్పుడు బిల్లు ప్రవేశపెట్టాలో నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి ఉన్నదని బీజేపీ ఎంపీ జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. ఇది అప్రజాస్వామికమని ఖర్గే వ్యాఖ్యానించారు. కాగా మహిళా రిజర్వేషన్‌లో భాగంగా దళితులు, బీసీలకు రిజర్వేషన్ మాటేమిటని ఆర్‌జేడీ ఎంపీ మనోజ్ ఝా ప్రశ్నించారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుకు ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది.

# 99 రోజుల కార్యాచరణతో గ్రామస్థాయి సమస్యల పరిష్కారం

➢ మొదటి పేజి తరువాయి

పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం సాగుతోందని వివరించారు.మహాలక్ష్మి ఉచిత బస్సు, ?500 గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు."తెలంగాణ రైజింగ్--2047" విజన్‌తో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కలిసి దేశానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యాచరణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కోరారు.

# ఏడు మండలాల అప్పగింత బిజెపి పుణ్యమే

➢ మొదటి పేజి తరువాయి

ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్‌లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ధి కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్‌లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధమా? ఏది అబద్ధం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాలేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు. క్యాబినెట్ మంత్రిగా ఉండి, ఏ ప్రభుత్వం అయినా ప్రజా ధనంతోనే నిర్మాణాలు చేస్తుందన్న ఇంగితం మరిచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనమని వ్యాఖ్యనించారు. గతంలో బీజేపీ ప్రభుత్వ పెద్దలే నితిన్ గడ్కరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా ? చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా' (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. 2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి ఏకంగా 2.2 కోట్ల ఎకరాలకు పెరిగిందని, దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే ' అని వెల్లడించడం మీ కళ్ళకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని, తెలంగాణకు నిధులు కేటాయించాలని ఎంపీ సురేశ్ రెడ్డి ఎంతో హుందాగా బాధ్యతగా మాట్లాడిన దాన్ని సమర్థించకపోగా ఉల్టా బాధ్యత మరిచి వ్యర్థ రాజకీయ ప్రేలాపనలకు పాల్పడ్డాడని హరీష్‌రావు విమరించారు.8 మంది బిజేపీ

ఎంపీలు, 8 మంది కాంగ్రెస్ ఎంపీలు ఉండి తెలంగాణ వాదాన్ని రిప్రెజెంట్ చేయకుండా సప్రెస్ చేస్తుండటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

### అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్,ఏప్రిల్2 : ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యాపరంగా ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

## 10మంది గంజాయి బ్యాచ్ అరెస్ట్

కరీంనగర్,ఏప్రిల్2 గంజాయి వినియోగంపై నార్కోటిక్స్ ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం బిగిస్తున్నారు. వరుస రైడ్లతో గంజాయి స్మగర్లకు నిద్రలేకుండా చేస్తున్న పోలీసులు.. గురువారం కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో స్పెషల్ రైడ్స్ నిర్వహించారు. ప్రాంతీయ నార్కోటిక్స్ కంట్రోల్ సెల్స్, స్థానిక పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో 10 మంది గంజాయి వినియోగదారులు పట్టుబడ్డారు. నిందితులకు నిర్వహించిన పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అప్పగించారు.

## సంపులో పడి చిన్నారి మృతి

హైదరాబాద్,ఏప్రిల్2 :నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# గ్రూప్-1 నియామకాలకు గ్రీన్ సిగ్నల్

➢ మొదటి పేజి తరువాయి

సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో నియామక ప్రక్రియకు సంబంధించిన అనిశ్చితి తొలగిపోయి, అభ్యర్థులకు ఊరట లభించింది. ఈ తీర్పుతో నియామక ప్రక్రియ చట్టబద్ధతను మరోసారి ధృవీకరించినట్లు అయింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. హైకోర్టు నిర్ణయం సరైనదేనని స్పష్టం చేస్తూ, పిటిషనర్ల వాదనలను కోర్టు తిరస్కరించింది. దీంతో ఇప్పటికే చేపట్టిన నియామక ప్రక్రియకు పూర్తి స్థాయి మద్దతు లభించింది.

గ్రూప్-1 నియామకాలపై వచ్చిన ఆరోపణలు, వివాదాల నేపథ్యంలో ఈ తీర్పు కీలకంగా మారింది. అభ్యర్థులపై చేసిన ఆరోపణలకు న్యాయస్థానం స్పష్టమైన సమాధానం ఇచ్చినట్లయింది. దీనివల్ల అభ్యర్థులపై ఉన్న అనుమానాలకు తెరపడింది. ఈ తీర్పుతో నియామకాలకు సంబంధించిన అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. త్వరలో నియామక ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అభ్యర్థులు తమ నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు.ఇప్పటికే ఈ అంశంపై వివిధ స్థాయిల్లో చర్చలు జరిగినప్పటికీ, సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చడంతో వివాదానికి ముగింపు పలికింది. న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం మరింత బలపడినట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్పు ద్వారా అభ్యర్థులపై తప్పుడు ఆరోపణలు చేసిన వారికి గట్టి సందేశం వెళ్లింది. న్యాయపరంగా నిజం నిలిచిందని, అర్హులైన వారికి న్యాయం జరిగినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూట

➢ మొదటి పేజి తరువాయి

తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాలేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్‌రెడ్డి అన్నారు.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

➢ మొదటి పేజి తరువాయి

చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

## కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

### గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత

సంగారెడ్డి,ఏప్రిల్2 ఆర్‌సీ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు, కాటా శ్రీనివాస్‌పై ఎమ్మెల్యే ప్రత్యారోపణలు చేయడంతో వార్ మొదలైంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిజమైతే శివాలయంలో తడి బట్టలతో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు పూర్తిగా కట్టుబడి ఉన్నానని, గుడిలో తడి బట్టలతో ప్రమాణం చేస్తానని కాటా శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సవాల్‌పై ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇంకా స్పందించలేదు.

## ట్రాఫిక్ జంఝాటంపై పోలీసుల సర్వే

గ్రూప్ ప్రయాణాలతో రద్దీ తగ్గుతుందని వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్2 ఐటీ హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10,138 మంది సింగిల్ రైడర్లు (వాహనంలో ఒక్కరే ప్రయాణించేవారు) ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3,584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించారు

## హత్యాయత్నం కేసులో నిందితుడికి 3 సంవత్సరాల జైలు శిక్ష

జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 1 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన హత్యాయత్నం కేసులో నిందితుడికి కోర్టు శిక్ష విధించింది. గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి జీవన్ సూరజ్ సింగ్ విచారణ జరిపి నిందితుడు నేరం చేసినట్లు రుజువుకావడంతో 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు.పోలీసుల వివరాల ప్రకారం, గోదావరిఖని హనుమాన్ నగర్‌కు చెందిన జంగిలి మొగిలి (69), రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, 2022 సెప్టెంబర్ 13న రాత్రి 9:30 గంటల సమయంలో పాత వివాదాన్ని మనసులో పెట్టుకొని ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఫిర్యాదుదారుడి కుమారుడి కడుపులో కత్తితో పొడవగా, అడ్డుకునేందుకు వచ్చిన ఫిర్యాదుదారుడి మామను కూడా ఛాతిపై కత్తితో పొడిచాడు.ఘటన సమయంలో స్థానికులు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు అక్కడి నుండి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, అప్పటి ఎస్సై స్వామి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. పూర్తి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ చలికెల పద్మజ గారు సాక్షులను సమర్పించి, బలమైన వాదనలు వినిపించడం ద్వారా నేరం రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు.పెద్దపల్లి డీసీపీ బి. రాంరెడ్డి గారు, ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎ. ఇంద్రసేన రెడ్డి, కోర్ట్ కానిస్టేబుల్ అరుగొండ సతీష్ కుమార్ (పీసీ-754), సిఎంఎస్ కే. శంకర్ (హెచ్‌సీ)లు సాక్ష్యాలను సమర్పించడంలో సహకరించారు.ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన ప్రాసిక్యూషన్ బృందాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు

## మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో గ్రామసభలు



మహబూబాబాద్ జిల్లా /గంగారం /మార్చి -02(అక్షరం న్యూస్ )

సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరము కోసం . గురువారం గంగారంమండల వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. గ్రామ సభల ఆరంభంలో రాష్ట్ర గీతం ఆలపించి సభలను ప్రారంభించి సీఎం సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, పెంచిన పింఛన్ల పథకాలపై గ్రామస్తులకు సమగ్రంగా అవగాహన కల్పించారు.గ్రామాల్లో సమస్యలు ఉంటే సభలో తమ దృష్టికి తీసుకురావాలని, లబ్ధిదారులకు పింఛన్లు, ఇతరత్రా సమస్యలుంటే దరఖాస్తు చేసుకుంటే 99 రోజుల ప్రణాళికలో భాగంగా వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు సక్రమంగా అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను ప్రజలు వారి సమస్యలను అడిగి నివృత్తి చేసుకున్నారుఈ గ్రామ సభల్లో ఆయా పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, గ్రామస్తులు, వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

## మందమర్రి ఏరియాలో కేంద్ర పర్యావరణ శాఖ బృందం పర్యటన



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 2/ అక్షరం న్యూస్ -:

మందమర్రి ఏరియాలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ చర్యలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల బృందం గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కేంద్ర పర్యావరణ శాఖ సలహాదారు తరుణ్ కత్తుల, పర్యావరణ అధికారుల బృందం, సింగరేణి కార్పొరేట్ జి.ఎం (ఎన్విరాన్మెంట్) సైదులు, మరియు మందమర్రి ఏరియా జి.ఎం ఎన్. రాధాకృష్ణలతో కలిసి వివిధ ప్రాంతాలను సందర్శించారు. రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ గని పరిసర ప్రాంతాలను అధికారులు సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న కాలుష్య నివారణ చర్యలను అడిగి తెలుసుకున్నారు.హరితహారం - ప్లాంటేషన్: ట్రావెలింగ్ రోడ్ల వెంబడి చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్, గనుల పరిసరాల్లో పెరిగిన పచ్చదనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏరియాలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, గనుల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లను తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియ మరియు పునర్వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్.డి.టి.సి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, మందమర్రి ఏరియాలో పర్యావరణ సమతుల్యత కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ నిబంధనల అమలులో ఏరియా యాజమాన్యం ప్రదర్శిస్తున్న చొరవను కేంద్ర అధికారులు అభినందించారు. ఈ పర్యటనలో ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, ఆర్కే ఓసి మేనేజర్ పంకజ్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి మరియు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ప్రజలకు

# అనేక సంక్షేమ ఫలాలు ప్రభుత్వ విప్



ఓదెల/ పెద్దపల్లి ఏప్రిల్ 02(అక్షరం న్యూస్)

కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు ఈ సందర్భంగా

ఓదెల మండలంలోని రూపు నారాయణపేట గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభ సర్పంచ్ గొంగోని రమా శ్రీనివాస్ అధ్యక్షతతో గ్రామ సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే.చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర జాతీయ గీతంతో ప్రారంభించారు అనంతరం

సీఎం రేవంత్ రెడ్డి సందేశా చదివి వినిపించారుమాట్లాడుతూ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తోటే ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి ఎన్నో సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరుతున్నాయని అన్నారుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక నువ్వు భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500/- రూపాయలకు గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్ల కొనుగోలు 500 బోనస్, చేయూత



పెన్షన్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కళ్యాణలక్ష్మి /షాది ముబారక్ చెక్కులు, కొత్తరేషన్ కార్డులు అందించడం జరుగుతుంది అలాగే నూతన పథకాలు ఇందిరామ్మ కుటుంబ జీవిత బీమా ద్వారా ఆర్థిక సహాయం,ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం కల్పించడం జరుగుతుంది. దివ్యంగులైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టేడ్ మోటరైజ్డ్ వాహనలు పంపిణి అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను చేరవేసేలా ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా అందరూ అధికారులు సమిష్టిగా కృషి చేయడం వల్లే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,ఎంపీడీఓ అనిల్ రెడ్డి , ఏడి కౌటం రవీందర్ ఆలయ చైర్మన్ చీకట్ల మొండయ్య మరియు గ్రామ సర్పంచ్,బొంగోని రమ శ్రీనివాస్,ఉపసర్పంచ్ జిలుక స్వప్న సంతోష్,మరియు మండల నాయకులు ఆకుల మహేందర్ మాజీ సర్పంచ్ అంకం రమేష్ ,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు...

### జనగణన ఇక డిజిటల్ లోనే..

# బ్లాక్ వైస్ లిస్టు తయారు చేయండి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

జన గణన- 2027 లో భాగంగా హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ తయారు చేయాలని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఆదేశించారు. జన గణన 2027కు సంబందించి సన్నాహాలు చేయడంలో భాగంగా సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ జన గణన మొదటి దశ హౌస్ లిస్టింగ్ ఏప్రిల్, 2026 లో ప్రారంభం అవుతుందని రెండవ దశ జనాభా లెక్కల సేకరణ ఫిబ్రవరి 2027 లో ప్రారంభం అవుతుందని అన్నారు. ఏప్రిల్, 2026 లో ప్రారంభమయ్యే మొదటి దశకు కు సంబందించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి మూడు రోజుల్లో వార్డు




అధికారులు హౌస్ లిస్టింగ్ బ్లాక్ లు రూపొందించాలని అన్నారు. ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం 700-800 జనాభాకు లేదా 250-300 ఇండ్లకు ఒక హౌస్ లిస్టింగ్ బ్లాక్ గా గుర్తించాలని అన్నారు. జన గణన ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానం లో జరుగుతుందని అన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ కూడా అవకాశం కల్పించారని అన్నారు. ప్రక్రియలో డూప్లికేషన్ రావద్దని , ఏ ఒక్కరూ తప్పిపోవద్దని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎస్ ఇ గురువీర , ఇ ఇ పి వి రామన్ , అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , ఎ సి పి శ్రీ హరి , టి పి ఎస్ నవీన్ తో పాటు రీసోర్స్ పర్సన్ కేడశీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- **మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 2/ అక్షరం న్యూస్ -:

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి పట్టణ మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగ అన్నారు. గురువారం ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక)లో భాగంగా మందమర్రి మున్సిపాలిటీలోని 24 వార్డులలో మున్సిపల్ అధికారులు వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు పట్టణంలోని షిర్కె ఎరియాలోని 4వ వార్డు, 7వ వార్డు, 8 వ వార్డులోని 3వ జోన్ ఎరియాలో, 14 వ వార్డులో ఆయన పాల్గొన్నారు. ముందుగా "జయ జయహై తెలంగాణ" రాష్ట్ర గేయాన్ని ఆలపించి, అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), సన్నరకం వరికి బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ మరియు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరలు, కొత్త రేషన్ కార్డులు తదితర పథకాల గురించి వివరించారు. అలాగే, ఈ పథకాల లబ్ధిదారుల వివరాలను తెలియజేస్తూ, ఇంకా ప్రభుత్వ పథకాలు



అందని వారికి వినతిపత్రాలు, దరఖాస్తులు స్వీకరించారు. వార్డు అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమైన తీర్మానాలను చదివి వినిపించడం, వార్డు సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై చర్చించడం, వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే కొత్త పథకాల గురించి కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, ఇంచార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ వి. వసంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ యం. గోపీకృష్ణ, టౌన్ మిషన్ కో-ఆర్డినేటర్ ఏ. రఘురాం, 24 వార్డుల ప్రత్యేక అధికారులు, 24 వార్డుల వార్డు అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఆశ కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీలలో గ్రామసభలు

రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -02(అక్షరం న్యూస్ )

సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక పంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరము కోసం . గురువారం ముస్తాబాద్ మండల వ్యాప్తంగా ఆయా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. గ్రామ సభల ఆరంభంలో రాష్ట్ర గీతం ఆలపించి సభలను ప్రారంభించి సీఎం సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, పెంచిన పింఛన్ల పథకాలపై





గ్రామస్తులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే సభలో తమ దృష్టికి తీసుకురావాలని, లబ్ధిదారులకు పింఛన్లు, ఇతరత్రా సమస్యలుంటే దరఖాస్తు చేసుకుంటే 99 రోజుల ప్రణాళికలో భాగంగా వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు సక్రమంగా అందించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, గ్రామాల్లో ఏ సమస్య ఉన్నా గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను ప్రజలు వారి సమస్యలను అడిగి నివృత్తి చేసుకున్నారు ఈ గ్రామ సభల్లో ఆయా పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, గ్రామస్తులు, వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

## 34 వ డివిజన్‌లో గ్రామ సభ నిర్వహణ -- ప్రజా సమస్యలపై విస్తృత చర్చ



జ్యోతినగర్, ఏప్రిల్ 2:

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో నిర్వహిస్తున్న గ్రామ సభలలో భాగంగా, స్థానిక 34వ డివిజన్‌లో గ్రామ సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్ కార్పొరేటర్ స్వప్న ప్రియ భరత్ గౌడ్ అధ్యక్షత వహించారు.

గ్రామ సభలో ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై అధికారులు, ప్రజలు కలిసి విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులు వంటి అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు.కార్పొరేటర్ స్వప్న ప్రియ భరత్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ సభలు ప్రజల సమస్యలు తెలుసుకునే ముఖ్య వేదికలని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలు, సూచనలు ఆధారంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని తెలిపారు. ప్రతి సమస్యను నమోదు చేసి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, ఆరోగ్య సేవలు, విద్యా సదుపాయాల మెరుగుదల వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. కొంతమంది స్థానికులు పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, యువత కోసం క్రీడా మైదానాల అభివృద్ధిపై సూచనలు చేశారు. అదేవిధంగా చెత్త సేకరణలో నిర్లక్ష్యం, అనధికార నిర్మాణాలు, కాలుష్య సమస్యలపై కూడా ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## ఒకటవ డివిజన్ లో వార్డు సభ విజయవంతం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఒకటోవ డివిజన్ పీకే రామయ్య కాలనీలో వార్డు సభ గురువారం నిర్వహించారు. వార్డు సభ కార్యక్రమంకు అధ్యక్షత వహించిన వార్డు అఫీసర్ మేక అభినవ్ వార్డు సభ ప్రారంభంచే ముందు తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి అనంతరం డివిజన్ లోని సమస్యల పిర్యాదు లు తీసుకున్నారు. వార్డు ఆఫీసర్ మేక అభినవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయడం జరిగిందని డివిజన్ లో ఉన్న సమస్యలు డ్రైనేజీ సమస్య మంచినీళ్ల సమస్య మరియు ఉచిత కరెంటు గురించి అత్యధికంగా ఫిర్యాదులు వచ్చాయని వార్డు ఆఫీసర్ మేక అభినవ్ తెలిపారు ఒకటవ డివిజన్ లోని ప్రజలు ఇచ్చిన పిర్యాదు లను మా పై అధికారులకు తెలియజేసి తొందర్లోనే డివిజన్ ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలు పరిష్కారం చేస్తామని డివిజన్ అఫీసర్ మేక అభినవ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఒకటవ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్,ఇందిరమ్మ కాలనీ ఆర్ పి జి రాణి మేడిపల్లి ఆర్ పి,యం అంబికా,మున్సిపల్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్,మోహన్ ఎన్పీడీసీల్, అసిస్టెంట్ లైన్ మెన్ లక్ష్మణ్,ఎన్టీపీసీ పోలీస్ అధికారులతో పాటు అంగన్వాడి టీచర్స్,పికె రామయ్య కాలనీ ప్రభుత్వ పాఠశాల హెడ్ మాస్టర్ చిగురు వసుంధర.ఉపాధ్యాలు ప్రశాంత్,మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు లావణ్య,సోషల్ మీడియా ఇన్చార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, మున్సిపల్ ఇంటి పన్ను విభాగం అధికారి మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మణి, వినయ్,సందీప్,డివిజన్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## మృత్యుపాశంగా పొగళ్లపల్లి రహదారి -- పట్టించుకోని అధికారులు



మహబూబాబాద్ జిల్లా/ కొత్తగూడ/ ఏప్రిల్ 2(అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని పొగళ్లపల్లి గ్రామానికి వెళ్లే రహదారి ప్రస్తుతం మృత్యుపాశంలా మారింది. నెలల క్రితం రోడ్డు పైన మరమ్మతుల కోసం కంకర పోసి, అలాగే వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం సామాన్యుల ప్రాణాల మీదకు వస్తోంది.

**కుప్పలు తెప్పలుగా ప్రమాదాలు**

ఈ మార్గంలో ప్రయాణించే వారు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. కంకర రాళ్లు తేలి ఉండటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడిపోతున్నాయి. రోజుకు కనీసం ఇద్దరు ముగ్గురు వాహనదారులు ఈ దారిలో గాయాలపాలవుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా రాముని గుండాల గుట్ట వద్ద స్వయంభు సంజీవని హనుమంతుని జయంతి వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

హనుమాన్ జయంతి పురస్కరించుకొని 29వ డివిజన్ పరిధిలో గల రాముని గుండాల వద్ద స్వయంభు గుట్టకు వెలసిన సంజీవని హనుమంతుని విగ్రహానికి గురువారం పంచామృత అభిషేకం చేసి తీర్థ ప్రసాద హారతి తో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిమ్మరాజుల రవి 33 వ డివిజన్ కార్పొరేటర్ భూలక్ష్మి కుమారుడు అభిషేక్ చెల్ల నవీన్ నరేష్ అయ్యగారు గున్నాల శ్రీనివాస్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.





## చలి వేంద్రం ను ప్రారంభించిన బండి సదానందం యాదవ్



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 2/ అక్షరం న్యూస్ -:

మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలో బాటసారుల సౌకర్యార్థం గురువారం నూతనంగా ఏర్పాటుచేసిన చలివేంద్రం ను అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బండి సదానందం యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సదానందం యాదవ్ మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రివర్యులు పెద్దపల్లి పార్లమెంటు మెంబర్ గా అనేక సేవలందించిన కాకా వెంకటస్వామి జ్ఞాపకార్థం మందమర్రి పాత బస్టాండ్ లో చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెన్నూరు శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని అన్నారు. అందులో భాగంగానే నేడు ప్రజల సౌకర్యార్థం స్వర్గీయ కాకా వెంకట్ స్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో బత్తుల తిరుపతి, నాగుల దుర్గయ్య, తోట నరహరి, రామస్వామి, ఆర్. రామ్ రెడ్డి, ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు మొయ్య రాంబాబు. నాయకులు రామిరెడ్డి, తోట రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ తో దక్షిణ కొరియా బౌద్ధ బృందం భేటీ

- **ధర్మ యాత్రకు మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు**



మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ ఏప్రిల్ 2/ అక్షరం న్యూస్ -:

తెలంగాణ కార్మిక, ఉపాధి మరియు గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామిని దక్షిణ కొరియా బౌద్ధ కౌన్సిల్ ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బౌద్ధ విలువలు మరియు గౌతమ బుద్ధుని బోధనలను విస్తరించేందుకు మంత్రి అందిస్తున్న నిరంతర మద్దతుకు ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇటీవల నిర్వహించిన 'ధమ్మ యాత్ర'కు ఆయన అందించిన ప్రోత్సాహాన్ని ప్రశంసించారు.కర్ణాటకలోని కలబుర్గి నుంచి ప్రారంభమైన ఈ ధమ్మ యాత్ర, నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో ముగిసి, ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక యాత్రగా నిలిచిందని తెలిపారు.ప్రసిద్ధ నటుడు గగన్ మాలిక్ నాయకత్వంలో వచ్చిన ఈ ప్రతినిధి బృందంలో ఇంటర్నేషనల్ ఇంటర్‌చేంజ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు యోంగ్‌జో మున్, జనరల్ మేనేజర్ గ్యుహ్వా కాంగ్, ఎడ్యుకేషన్ ప్రెసిడెంట్ సుజియాంగ్ మున్, కాస్మెటిక్స్ సీఈఓ కియుం మీ హాన్, హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ మి క్యుంగ్ పార్క్, సెక్రటరీ వోన్ సియోప్ కిమ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాల వస్తువులు పంపిణీ



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మార్చి -02(అక్షరం న్యూస్ )

తాము బాగుండాలని అందరూ కోరుకుంటారు. అందరూ బాగుండాలనీ, అందులో తామూ ఉండాలని కొందరు మాత్రమే కోరుకుంటారు. అలాంటి అరుదైన మనిషి తన దాతృత్వాన్ని చాటుకున్నాడుపుట్టిన ఊరు, పెంచిన ఊరు (ఉన్న ఊరు) పై మమకారం కన్నతల్లి ప్రేమ వంటిది. ఎలాంటి సౌకర్యాలు లేకున్నా, ఆ ఊరుపై అభిమానం ఎప్పటికీ చెదిరిపోదు. ఎంత ఎత్తుకు ఎదిగినా, పల్లెటూరి బంధాలు, మట్టి వాసన ఇచ్చే అనుభూతిని ఏ నగరమూ ఇవ్వలేదు. భావించి గ్రామం లో ఉన్న పంచాయతీ కార్మికులకు నెలకు సరిపడ కిరాణా సామాను అందచేసారు వివరల్లోకి వెళ్తే...ముస్తాబాద్ మండలం చీకోడ్ గ్రామం లో గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కరెడ్ల శ్రీనివాస్ రెడ్డి సిద్దిపేట 1టౌన్ ఎస్ గా విధులు నిర్వర్తిస్తూన్న క్రమంలో చీకోడ్ పంచాయతీ గ్రామ సిబ్బంది కి సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు నిత్య వసర వస్తువులు కోరగా ఈ రోజు పారిశుధ్య కార్మికులకు మహిళలకు చీరేలు తువాలాలు, నిత్యావసర కిరాణా సరుకులు నెల రోజులకు సరిపడా వి అందచేశారు. కార్మికుల ను శాలువా తో సన్మానించారు.పల్లెల్లో చేసే ప్రతి స్వచ్ఛ కార్యక్రమం వెనుక పారిశుధ్య కార్మికుల శ్రమ ఉంటుందని అన్నారు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ బొమ్మేన ఆంజనేయులు, ఉప సర్పంచ్ అస రంజి త్, వార్డు సభ్యులు, కరెడ్ల మల్లారెడ్డి, తీర్మల్ రెడ్డి, నర్సారెడ్డి, రాజి రెడ్డి యాదగిరి రెడ్డి,వార్డు సభ్యులు గ్రామ మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

## ఎన్టీపీసీ టౌన్షిప్‌లో గ్రామ సభలు

# ప్రజల సమస్యలపై కార్పొరేటర్ల స్పందన







జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎన్టీపీసీ పరిధిలోని వివిధ డివిజన్లలో గ్రామ సభలు నిర్వహిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకునే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో 32వ డివిజన్‌లోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కార్పొరేటర్ తోట మమత కుమారస్వామి పాల్గొన్నారు. ఈ సభలో స్థానిక ప్రజలు తమ సమస్యలు, అవసరాలు, అభ్యర్థనలు వివరించి దరఖాస్తులు సమర్పించగా, కార్పొరేటర్ వాటిని స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్షిప్‌లోని 24వ డివిజన్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన గ్రామ సభలో స్థానిక కార్పొరేటర్ కొలని కవిత వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో కూడా డివిజన్ ప్రజలు తమ సమస్యలను వెల్లడిస్తూ దరఖాస్తులు అందజేశారు. ప్రజల అభ్యర్థనలను శ్రద్ధగా విన్న కార్పొరేటర్, వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ గ్రామ సభల ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లభించడంతో పాటు, పరిష్కార ప్రక్రియ వేగవంతం అవుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకునే ఈ విధమైన కార్యక్రమాలు ప్రజాస్వామ్యానికి మరింత బలాన్ని చేకూరుస్తాయని పేర్కొంటున్నారు.

## రామగుండం పౌరులు గర్వపడే విధంగా

# అందరం కలిసి అభివృద్ధి సాధిద్దాం... ఎమ్మెల్యే పిలుపు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పౌరులుగా గర్వ పడే విధంగా అందరం కలిసి నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని రామగుండం శాసన సభ్యులు ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ పిలుపు నిచ్చారు"ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 47, 48, 49 డివిజన్ల సంయుక్త వార్డు సభ మార్కండేయ కాలనీ లోని ఒక పాటశాల లో నిర్వహించారు. ఈ వార్డు సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇక్కడ నుండి వలస పోయిన వారు గత రెండేళ్లుగా రామగుండం నగరంలో జరుగుతున్న అభివృద్ధి చూసి ఇక్కడే ఇల్లు కట్టుకొని స్థిర పడడానికి తిరిగి వస్తున్నారని అన్నారు. రామగుండం నగరాభివృద్ధికి అవసరమైన కోట్లాది రూపాయల నిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ నిధులు సద్వినియోగం చేసుకుంటూ ప్రతి వాడలో రోడ్లు , యు జి డి , వీధి దీపాలు , మంచి నీరు తదితర వసతులతో పాటు ప్రదాన రహదారులు , కూడళ్ళు , వ్యాపార కేంద్రాలు అందంగా విశాలంగా తీర్చిదిద్దుకుంటున్నామని అన్నారు. నగరాన్ని ఒక ప్రధాన వైద్య , విద్య , వాణిజ్య , పర్యాటక కేంద్రంగా రూపొందించడమే ధ్యేయంగా తనతో పాటు మేయర్ , డిప్యూటీ మేయర్ , నగర పాలక సంస్థ పాలక వర్గ సభ్యులు , కమిషనర్ , అధికార బృందం సమర్ధవంతంగా పని చేస్తున్నారని అన్నారు. త్వరలోనే రామగుండం నగరం అద్భుతంగా అభివృద్ధి చెంది ఉత్తర తెలంగాణలోనే ఒక ఉత్తమ నగరం గా గుర్తింపు తెచ్చుకుంటుందని అన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలు ఈ రోజు సన్న బియ్యం తినగలుగుతున్నారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కొత్త రేషన్ కార్డులు రామగుండం నగరంలో 18, 861 మంజూరు చేశామని అన్నారు. మౌళిక వసతుల కల్పనకు సుమారు రూ 15 కోట్లు ఖర్చు పెట్టి 2 బి హెచ్ కె ఇండ్లను ఉపయోగంలోకి తీసుకువస్తూ పాత లబ్దిదారులకే అందజేస్తున్నామని అన్నారు. దళారుల ప్రమేయం లేకుండా అర్హత ఉన్నవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. రామగుండం నగరంలో 3500 ఇండ్లు కొత్తగా ఇవ్వబోతున్నామని అన్నారు. సింగరేణి , జెన్ కొ స్థలాల్లో నివసిస్తున్న అందరికీ పట్టాలు ఇప్పిస్తామని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గౌతమి నగర్ లో హీజ్రా లకు ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని అన్నారు. వైద్య చికిత్స నిమిత్తం సి ఎం రిలీఫ్ ఫండ్ నుండి వందలాది మందికి లక్షలాది రూపాయల గ్రాంట్ మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 46 , 47, 48, 49 డివిజన్ లలో మూడు కోట్ల రూపాయలతో పెద్ద నాలా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా ఇవ్వడానికి రూ 20 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే పరమావధి గా పని చేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ పాలనలో ప్రజలను భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ప్రజా పాలన వార్డు సభలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సభల్లో ప్రజలు , లబ్దిదారుల అభిప్రాయాలను స్వీకరించి ప్రగతి ప్రణాళిక తయారు చేయడం జరుగుతుందని అన్నారు. పథకాలను గడప గడప కు చేర్చడమే లక్ష్యంగా తమ పాలక వర్గ లక్ష్యమని అన్నారు. పదేళ్ళ పాలనలో రూ 150 కోట్ల విలువైన పనులు కూడా చేపట్టలేదని మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఎం ఎల్ ఎ గా ఎన్నికయిన తరువాత కేవలం రెండేండ్ల కాలంలోనే రామగుండం నగరంలో రూ 800 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నవిషయం ప్రజలు గమనించాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రారంభించిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ స్వచ్ఛ నగరం గా గుర్తింపు వచ్చేంత వరకు కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. రైతు భరోసా , ఇందిరమ్మ ఇండ్లు , మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు , రూ 500/ కె గ్యాస్ సిలిండర్ , చేయూత ఫించన్లు , కళ్యాణ లక్ష్మీ , షాదీ ముబారక్ , స్వశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ ,ఇందిరా మహిళా శక్తి , వడ్డీ లేని రుణాలు , కొత్త రేషన్ కార్డులతో పాటు మరెన్నో కొత్త పథకాలు కూడా రానున్నాయని అన్నారు. ఈ వార్డు సభలో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య ,అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ , 47, 48, 48 డివిజన్ల కార్పొరేటర్లు దాసరి సాంబమూర్తి , రేణికుశీట్ల నిర్మలా దేవి , సాగి సంతోష్ రావు , వివిధ డివిజన్ల కార్పొరేటర్లు ముస్తఫా , సతీష్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయ హే తెలంగాణతో సభ ఆరంభం కాగా మొదట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సందేశాన్ని చదివి వినిపించారు. ఆ తరువాత వివిధ ప్రభుత్వా పథకాల ద్వారా లబ్ది పొందిన వారితో రూపొందించిన వీడియో ప్రదర్శించారు. ఆయా శాఖల అధికారులు తమ విభాగం ద్వారా అమలు చేస్తున్న పథకాలు , లబ్ది పొందిన వివరాల నివేదిక చదివారు.




### 46 వ డివిజన్ వార్డు సభ :

రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కార్పొరేటర్ గా ప్రాతినిధ్యం వహిస్తున్న 46 వ డివిజన్ వార్డు సభ సంజయ్ గాంధీ నగర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించడంతో పాటు పథకాల ద్వారా లబ్ది పొందిన వివరాలు , ఇందిరా నగర్ లో జరిగిన అభివృద్ధి పనులతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే పనులను కూడా వివరించారు. తాము అధికారం లోకి వచ్చిన నెలా పదిహేను రోజుల స్వల్ప కాల వ్యవధిలోనే ఇందిరా నగర్ లో ఇంటింటా సర్వే నిర్వహించి ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల జాబితా తయారు చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు వస్తుందని అన్నారు. 46 వ డివిజన్ లో 464 మంది చేయూత ఫించన్లు పొందుతున్నారని అన్నారు. వడ్డీ లేని రుణాలు స్వశక్తి మహిళలకు ఇప్పిస్తున్నామని అన్నారు . ఆర్య వైశ్య భవనం నుండి సంజయ్ నగర్ వరకు విశాలమైన రోడ్డు నెల రోజుల్లో నిర్మిస్తామని అన్నారు. రూ 70 లక్షలతో రైల్వే ట్రాక్ వరకు సి సి రోడ్డు వేయడం జరిగిందని అన్నారు. చీకట్ల లేకుండా కొత్త హై మాస్ లైట్లు కూడా పెట్టించడం జరిగిందని అన్నారు. ఈ వార్డు సభలో టి పి ఎస్ నవీన్ , వివిధ విభాగాల అధికారులు , సిబ్బంది పాల్గొన్నారుకాగా అన్ని వార్డులో ఏక కాలంలో ఈ వార్డు సభలు కొనసాగాయి. కొన్ని ముఖ్య సమస్యలు దృష్టికి తీసుకు రాగా వాటిని ప్రభుత్వానికి నివేదించడానికి సభలో తీర్మానాలు కూడా చేశారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి..



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖనిలో సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి సందర్భంగా గురువారం రామగుండం కార్పొరేషన్ ఏరియా తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు గున్నాల శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కోటా రవి గౌడ్ తోపాటు గౌడ కులస్తులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొగలుల సామ్రాజ్యంపై దండయాత్ర చేసి గోల్కొండ కోటను జయించి బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ని కొనియాడారు .ఆయన ఆశయాలను గౌడ కులస్తులు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేపూరి శ్రీనివాస్ గౌడ్, కృష్ణ గౌడ్ మాచిడి మహేందర్ గౌడ్, బెందె నాగభూషణం గౌడ్, కోడూరి రవి గౌడ్, జనార్దన్ గౌడ్ ,కుమార్ గౌడ్ ,శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బల్మూరి దంపతులకు ఎన్ టి పి సి బీజేపీ శాఖ ఘనంగా సత్కారం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని న్యాయవాదుల సంఘం 2026--2027 సంవత్సరానికి జరిగిన ఎన్నికల్లో బల్మూరి అమరేందర్రావు అధ్యక్షుడిగా విజయం సాధించిన సందర్భంగా, అలాగే శ్రీమతి బల్మూరి వనిత భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా, బీజేపీ--ఎన్‌టీపీసీ మండలం తరపున వారికి ఘన సన్మానం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీసీ--రామగుండం మండల అధ్యక్షులు మిట్టపెల్లి సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఈదునూరి చిరంజీవి, మాజీ మండల అధ్యక్షులు భూసిపాక సంతోష్, సీనియర్ నాయకులు జూపూడి అమరేశ్వరరావు, కొండపల్కల నరేష్, ఈదునూరి శ్రీకాంత్, రేగొండ సంతోష్, కుందారపు నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుకుంటూ, బల్మూరి అమరేందర్రావు గారు న్యాయవాదుల సంఘాన్ని సమర్థంగా ముందుకు నడిపిస్తారని, అలాగే బల్మూరి వనిత గారు పార్టీకి మరింత సేవలు అందిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎన్ టి పిసి లో ఘనంగా జరిగిన సర్వాయి పాపన్న 316వ వర్ధంతి వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి సందర్భంగా గురువారం ఎన్టిపిసి పట్టణ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మేడిపల్లి సెంటర్ చౌరస్తాలో పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బి పవర్ హౌస్ గడ్డ హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు సమర్పించారు ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ బాధ్యులు మాచేడి మహేందర్ గౌడ్ తిరుమల సురేందర్ గౌడ్ కట్ల కనకయ్య కంకటి రవి గౌడ్ బుర్ర దేవేందర్ గౌడ్ భూమేష్ గౌడ్ ఆరెల్లి కుమార్ గౌడ్ రంగు దుర్గాప్రసాద్ గౌడ్ గున్నాల శ్రీధర్ కోడూరు రవి జనార్ధన్ పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్ ఏపూరి లక్ష్మణ్ గౌడ్ హరీష్ గౌడ్ బిందె నాగభూషణం గౌడ్ మరియు రేవా అధ్యక్షులు ఆకుల రామ కిషన్ భగవతి యూత్ ప్రధాన కార్యదర్శి పైడా సాయికుమార్ కనుకుంట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఎన్టిపిసిలో కాంట్రాక్టు కార్మికులకు పీవీసీ సర్టిఫికెట్ తప్పనిసరి ఎందుకు?

- ఏఐటియు సి నేతల ప్రశ్న

జ్యోతి నగర్, ఎన్టిపిసి:ఎన్టిపిసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై అమలవుతున్న పీవీసీ సర్టిఫికెట్ విధానంపై ఏఐటీయూసీ నేతలు ఆర్ లక్ష్మణ్ నాంసాని శంకర్ ప్రశ్నించారు. గత 35 సంవత్సరాలుగా విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తూ కాంట్రాక్టు కార్మికులు నిరంతరం సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఇప్పటికే శాశ్వత గుర్తింపులుగా క్లిమ్స్ ఐడీ (కార్మిక సమాచారం నిర్వహణ సంఖ్య), పీఎఫ్ యూఏఎన్ (భవిష్యనిధి యూనివర్సల్ అకౌంట్ నంబర్), ఈఎస్ఐ (ఉద్యోగుల రాష్ట్ర బీమా) సంఖ్య, అలాగే ఆధార్ నంబర్ వంటి గుర్తింపులు ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ శాశ్వతంగా ఒకటే నంబర్లుగా కొనసాగుతున్నప్పటికీ, ప్రతి సంవత్సరం పీవీసీ సర్టిఫికెట్‌ను సమర్పించాలనే నిబంధనను విధించడం అనవసరమని ఆక్షేపించారు. ఈ విధానం కార్మికులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తోందని, అనవసర భారాన్ని పెంచుతోందని పేర్కొంటూ, వెంటనే ఈ నిబంధనను యాజమాన్యం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఆర్. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు

## వేసవి కాలంలో ఆరోగ్య జాగ్రత్తలపై

# 11 బొగ్గు గని పై అవగాహన కార్యక్రమం

జ్యోతినగర్, ఏప్రిల్ 2: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

వేసవి కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన జాగ్రత్తలపై సింగరేణి రామగుండం ఆర్.జి-1 ఏరియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్.జి-1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ ఆదేశాల మేరకు, రామగుండం ప్రాంతీయ ఆసుపత్రి సహాయ ప్రధాన వైద్య అధికారి డాక్టర్ అంబికా పర్యవేక్షణలో గోదావరిఖని 11 ఇంక్లైన్ గని వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆరోగ్య అధికారి డాక్టర్ కె. పద్మ ఉద్యోగులకు వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరంగా అవగాహన కల్పించారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు మరియు ప్రథమ చికిత్స విధానాలను వివరించారు. వేసవిలో తరచూ నీరు తాగడం ఎంతో





ముఖ్యమని, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఎండలోకి వెళ్లేటప్పుడు తలపై టోపీ, తలపాగా లేదా గొడుగు ఉపయోగించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. శీతల పానీయాలు మరియు మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. తాజా పండ్లు, కూరగాయలు, బీన్స్ వంటి పోషకాహారం తీసుకోవాలని, ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, సమూహ ఇంజనీర్ బి. రాందాస్, గని మేనేజర్ బి. మల్లేశం, పిట్ ఇంజనీర్ డి. రాకేష్, సంక్షేమ అధికారి రవీందర్, పిట్ కార్యదర్శి నాయిని శంకర్ తదితర అధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చొప్పదండి పట్టణ పద్మశాలి సంఘం

# నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిధిగా పాల్గొన్న పెద్దపల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య
- పాల్గొన్న సంఘం సభ్యులు

చొప్పదండి /కరీంనగర్,మార్చి 29 (అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణ పద్మశాలి కుల సంక్షేమ సంఘం,యువజన సంఘం నూతన అద్యక్షులు పచ్చునూరి తిరుపతి, అనుమల్ల సత్యం లు,కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శిగా వల్లాల జగన్, కోశాధికారిగా దండె సత్యానందం తో పాటు యువజన సంఘం ప్రధానవకార్యదర్శిగా గుండేటి వెంకటరమణ, కోశాదికారిగా పొరండ్ల నితీష్, మిగతా కార్యవర్గ సభ్యుల ప్రమాణం చేశారు. అనంతరం అద్యక్షులు మాట్లాడుతూ పద్మశాలి అక్షయపాత్ర, పద్మశాలి కులం కమిటి హాల్, పద్మశాలి కుబుంబ సభ్యులను కలుపుకొని పాలనను కొనసాగిస్తానని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి





పెద్దపెల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య ముఖ్య అతిథిగా హాజరుకాగా,జిల్లా అద్యక్షులు మెతుకు సత్యం, కరీంనగర్ కార్యవర్గం నగరపాలిక కరీంనగర్ 18వ వార్డు కార్పోరేటర్ వాసాల రమేష్,17వ వార్డు కార్పోరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్,వాజీ కౌన్సిలర్ స్వర్గం నర్సయ్య, జిల్లా యువజన సంఘం అద్యక్షులు గుడిమల్ల శ్రీకాంత్ ,జిల్లా యువజన ఉపాధ్యక్షులు మెతుకు చైతన్య క్రిష్ణ, కరీంనగర్ పట్టణ ఉపాధ్యక్షులు ఎలిగేటి శ్రీనివాస్, పద్మశాలి జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాల క్రిష్ణహరి ,ఎలిగేటి తిరుపతి, గౌరవ అద్యక్షులు దండె రాజయ్య, ఎన్నం మునిందర్, దూస రాము, బోగ హరికిషన్,వల్లాల నగేష్, మంచికట్ల విఠల్,మల్లేశం, మారం శ్రీపెల్లి నాగభూషణం, దండె లింగన్న సిరిపురం ఆనందం, కొక్కుల కనుకయ్య, అనుమల్ల రమేష్, సిరిపురం చిన గంగారాం, పట్టణ మరియు యువజన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఎలక్షన్స్ ఆఫీసర్స్ కళ్యాణడపు శంకరయ్య,దూస లక్ష్మీనర్సయ్య, ఉడుత శంకరయ్య మరియు పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## చొప్పదండి పట్టణ పద్మశాలి అధ్యక్షులుగా పచ్చునూరి తిరుపతి ఎన్నిక

- యువజన విభాగం పట్టణ అధ్యక్షులుగా అనుమల్ల సత్యం ఎన్నిక

చొప్పదండి /కరీంనగర్, మార్చి 19 ( అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణ పద్మశాలి సంఘము అధ్యక్షుడు గా పచ్చునూరి తిరుపతిని , యువజన సంఘము పట్టణ అధ్యక్షుడు గా అనుమల్ల సత్యం ను చొప్పదండి పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా వీరు మాట్లాడుతూ పద్మశాలి సంఘం అభివృద్ధికి, సంఘం సభ్యుల అభివృద్ధికి దోహద పడతామని అన్నారు.



## మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం

- ఛార్జీల పెంపు అమలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/2 ఏప్రిల్/ అక్షరం న్యూస్ :

జిల్లాలో సర్వర్ నిర్వహణ పనుల నేపథ్యంలో 'మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటల నుంచి ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 8:00 గంటల వరకు సర్వర్ నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు వెల్లడించారు. సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రతా వ్యవస్థల అప్‌గ్రేడ్, సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కాలంలో సంబంధిత విభాగాలకు చెందిన అన్ని ఆన్లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయబడతాయని తెలిపారు. ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు. భవిష్యత్తులో వేగవంతమైన, అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ చర్యలు ఉపయుక్తమవుతాయని పేర్కొన్నారు. ఇక 'మీ సేవ' కేంద్రాల ద్వారా అందించే వివిధ ధ్రువపత్రాలు మరియు ఇతర సేవలకు సంబంధించిన సేవా ఛార్జీలను ప్రభుత్వం సవరించినట్లు తెలిపారు. సవరించిన ఛార్జీలు ఇవాళ్టి నుంచే అమల్లోకి వచ్చాయి. ఇప్పటివరకు రూ.35గా ఉన్న కనీస సేవా ఛార్జీని రూ.62కు పెంచినట్లు తెలిపారు. 'ఏ' కేటగిరీ సేవలకు రూ.62 చొప్పున, 'బీ' కేటగిరీ సేవలకు రూ.80 చొప్పున ఛార్జీలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అదనంగా కరెంటు బిల్లులు, ఈ-పాస్ సేవలు, బయోమెట్రిక్ సేవలు, డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన సేవలకు కూడా సవరించిన ఛార్జీలు వర్తిస్తాయని వెల్లడించారు. ప్రజలు ఈ మార్పులను గమనించి సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.




## ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు భరోసా..!

- పీకే రామయ్య కాలనీలో ఇందిరమ్మ ఇంటి పనులకు శ్రీకారం
- 24వ డివిజన్ కార్పొరేటర్ కొలని కవిత వెంకటరెడ్డి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ప్రతి పేదవారికి గృహవసతి కల్పించడం కాంగ్రెస్ పార్టీ సంకల్పమని 24వ డివిజన్ కార్పొరేటర్ కొలని కవిత వెంకటరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఎన్టీపీసీ ప్రాంతంలోని పీకే రామయ్య కాలనీలో లబ్ధిదారులు దండెర జయ నరసింహ కి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ కవిత వెంకటరెడ్డి, పూజా కార్యక్రమాన్ని ప్రారంభించి లబ్ధిదారుతో మాట్లాడి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి పేదవారికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సహకారంతో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు"ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక భద్రత, గౌరవం. ఆ గౌరవాన్ని ప్రతి పేద కుటుంబానికి అందించడం మా బాధ్యత" అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి శ్యాం కుమార్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతుపై అడవిపంది దాడి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ జిల్లా/ గంగారం / ఏప్రిల్ 2 (అక్షరం న్యూస్ )

మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పుట్టల భూపతి గ్రామానికి చెందిన సోలం రవికుమార్ వయసు 35 సంవత్సరాలు రోజు మాదిరిగానే తన మొక్కజొన్న చేను కావలికి వెళ్ళగా అప్పటికే చేనులో పంటను తింటూ ఉన్న అడవి పంది ఒక్కసారిగా వచ్చి రవికుమార్ పై దాడి చేసి ఎడమ కాలు తొడను మోకాలిని కొరికి తీవ్ర గాయాలు చేయగా చుట్టుప్రక్కల చేనులవాళ్ళు వచ్చి అరవడంతో అడవి పంది అక్కడనుండి అడవిలోకి వెళ్లిపోయింది కుటుంబ సభ్యులు వెంటనే రవికుమార్ ను 108 లో నర్సంపేటలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా తీవ్ర గాయాల పాలైన రవికుమార్ కు డాక్టర్లు తొంటికి ఆపరేషన్ చేశారు. రవికుమార్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. మండలంలో ఎప్పుడూ లేని విధంగా అడవి పంది దాడి చేయడంతో రైతులు తమ పంటలు చేతికి రావాలంటే ఇంకా చాలా సమయం పడుతుంది ఇలా అయితే మా చేను దగ్గర ఎలా కాపలా ఉండాలి అని గ్రామ రైతులు ఎంతో భయాందోళనకు గురవుతున్నారు.



## గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో కంటి శాస్త్ర చికిత్సలు ప్రారంభం... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని (రామగుండం)జనరల్ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలను ప్రారంభించామని, అవసరమైన ప్రజలు వీటిని వినియోగించుకోవాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆప్తామాలజిస్ట్ విభాగం లో శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో నిన్న ఒక కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని ప్రజలు, గోదావరిఖని పరిసర ప్రాంతాల ప్రజలు కాట్రేక్ ఆపరేషన్లు అవసరం అయితే గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రావాలని, ఇక్కడ అవసరమైన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.



# ప్రజల మేలుకోసమే సంక్షేమ పథకాలు



- **గ్రంధాలయ చైర్మన్ రాంబాబు**

జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) ఏప్రిల్ 02:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలోలో భాగంగా రఘునాథపల్లి కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ బొల్లం ఉమారాణి అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభ లో ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల మూడు నెలలు పూర్తయినందున కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ గత పాలకుల చేసినటువంటి తప్పిదాలను సరిచేస్తూ సంక్షేమ పథకాలు మరియు రాష్ట్రం అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు పాలకులం కాదు సేవకులం అన్న భావనతో మన నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక శాసనసభ్యులు కడియం శ్రీహరి దేవాదుల సృష్టికర్త అని కోనియాడారు. మరియు ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు ప్రజల జీవితాలలో ఒక స్పష్టమైన మార్పు అదేవిధంగా ప్రభుత్వం ఏర్పాటైన నుండి ప్రజా పాలనలో భాగంగా ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లు,మహాలక్ష్మి పథకం, గృహ జ్యోతి పథకం ,గృహ లక్ష్మీ పథకం, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం, రైతు భరోసా, రైతు బీమా, కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్, వంటి ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నది. ఇదే కాకుండా గత ప్రభుత్వము 5 గుంటలు 10 గుంటలు ఉన్న వ్యవసాయ రైతులకు మాత్రమే రైతు బీమా కింద ఐదు లక్షల అందించింది కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 5 లక్షల బీమా అందించే కార్యక్రమం ప్రారంభించింది. ఇంత మంచి మంచి కార్యక్రమాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచానికే రాష్ట్రాన్ని ఒక ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి ఎదగాలి అన్న ఆకాంక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు నడుస్తున్నది అని అన్నారు. ఆ ఉద్దేశంతోనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించారు అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారి హౌసింగ్ శాఖ ప్రోగ్రాం డైరెక్టర్ మాత్రు నాయక్, రఘునాథపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ కోదండరాం ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, ఎస్సై దూదిమెట్ల నరేష్, పంచాయతీ కార్యదర్శి కె బాలకిషన్ తో పాటు శాఖల అధికారులు హాజరైనారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి గౌడ్ జిల్లా నాయకులు గాదె మహేందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎండి భాష మియామాజీ సర్పంచి పోకల శివకుమార్ గ్రామ పార్టీ అధ్యక్షులు కడారి రవి, ఉపసర్పంచ్ దేవర యాకయ్య వార్డు మెంబర్లు మమత,అనిత, రాధా, రాములు గంద్ర కృష్ణ, మరియు అంగన్వాడీ టీచర్స్, ఆశ వర్కర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### ఎన్టీపీసీ సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్

## ఘనంగా ముగింపు -- సింహాద్రి, వెల్లూరు జట్లు విజేతలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం ఎన్టిపిసి టౌన్షిప్ లో గత మూడు రోజులుగా జరుగుతున్న సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ గురువారం రాత్రి ముగిసింది. నాలుగు రోజులుగా జరిగిన ఈ పోటీల్లో వాలీబాల్ బాస్కెట్బాల్ స్విమ్మింగ్ పూల్ జరిగాయి. పలు క్రీడా విభాగాల్లో జరిగిన పోటీలు క్రీడాకారుల ప్రతిభను ప్రతిబింబించాయి. ఈ స్పోర్ట్స్ మీట్‌లో వాలీబాల్, మహిళల బాస్కెట్బాల్, స్విమ్మింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వాలీబాల్ గ్రాండ్ ఫైనల్‌లో సింహాద్రి జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. రామగుండం జట్టు రన్నరప్‌గా నిలిచింది. స్పందన వాలీబాల్ మైదానంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌కు ప్రాజెక్ట్ హెడ్ చందర్ కుమార్ సమంత ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. మహిళల బాస్కెట్బాల్ విభాగంలో వెల్లూరు జట్టు విజేతగా నిలవగా, ఎన్టీపీసీ రామగుండం జట్టు రన్నరప్‌గా నిలిచింది. మహిళా క్రీడాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రీడా పోటీలలో వివిధ ప్రాజెక్టుల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. ఉద్యోగులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జట్లను ఉత్సాహపరిచారు. మొత్తంగా, ఎన్టీపీసీ సదరన్ రీజియన్ స్పోర్ట్స్ మీట్ విజయవంతంగా ముగియడంతో పాల్గొన్న క్రీడాకారులకు, నిర్వాహకులకు అభినందనలు వెల్లువెత్తాయి.









## మంచిర్యాలలో దొంగతనం కేసు ఛేదింపు: నిందితుడి అరెస్ట్, బంగారం మరియు బైక్ స్వాధీనం

మంచిర్యాల జిల్లా /మంచిర్యాల్ టౌన్ /ఏప్రిల్ 2 /అక్షరం న్యూస్–

మంచిర్యాల పట్టణంలోని జ్యోతినగర్‌లో జరిగిన భారీ దొంగతనం కేసును టౌన్ పోలీసులు ఛేదించారు. జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు కలవేన వసంత్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి బంగారం, బైక్ మరియు మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

**కేసు వివరాలు:**

గత నెల మార్చి 10న జ్యోతినగర్‌కు చెందిన ఇంధరపు రాజయ్య తన కూతురు ఇంటికి వెళ్లిన సమయంలో, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 8 తులాల పైచిలుకు బంగారం, 29 తులాల వెండి మరియు 18 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 141/2026 కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**అరెస్ట్ జరిగిన తీరు:**



ఈ నెల 1వ తేదీన మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా కనిపించిన కలవేన వసంత్ (21)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు జల్సాల కోసం తన స్నేహితులతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుండి 19.37 గ్రాముల బంగారు పుస్తెల తాడు, ఒక యమహా =15 బైక్ మరియు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితుడి స్నేహితులైన అక్షయ్, అభి మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు.

## చిన్నారులకు దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్





శంకరపట్నం/కరీంనగర్/ఏప్రిల్ 2/అక్షరం న్యూస్ :-

అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ చింతల లావణ్య- శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు ఉచిత దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ అంగన్వాడీ స్థాయి నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు, మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని, చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, విద్యాభ్యాసానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రణధీర్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ,ఏడబ్ల్యూ టి సరిత, అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.


## కన్నాపూర్ లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



శంకరపట్నం/కరీంనగర్/ఏప్రిల్ 2/ అక్షరం న్యూస్ :-

ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నిజం చేసేదే 'ఇందిరమ్మ ఇల్లు' పథకమని కన్నాపూర్ గ్రామ సర్పంచ్ నూనె రమా- శ్రీనివాస్ అన్నారు. కన్నాపూర్‌లో లబ్ధిదారులు పిన్ రెడ్డి వసంత-మల్లారెడ్డి దంపతుల గృహప్రవేశ వేడుకలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నూనె అశోక్,కార్యదర్శి రాజేశం, ఎలకపల్లి సంపత్ తదితరులు పాల్గొన్నారు.ల

## వర్షం నీరుతో ఇంటికి ముప్పు



శంకరపట్నం/కరీంనగర్/ఏప్రిల్ 2/అక్షరం న్యూస్ :-

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నివేక్షణ స్థలంలో వర్షపు నీరు, తదితర నీరు నిలవడంతో పల్లె మనోహర్ రెడ్డి ఇంటికి ముప్పు ఉందని బాధితుడు ఆరోపిస్తున్నాడు. శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామంలో పల్లె మనోహర్ రెడ్డి ఇంటి పక్కన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సంబంధించిన భూమి తో తన ఇంటికి ముప్పు ఉందని పలుమార్లు ఫ్యాక్స్ సంబంధిత సభ్యులకు అధికారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని మనోహర్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఫ్యాక్స్ జిల్లా స్థాయి అధికారులకు మరోసారి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఫాక్స్ అధికారులను ఆదేశించారు.

## మహనీయుల ఆశయాలను కొనసాగించాలి: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా /నస్పూర్ /ఏప్రిల్ 2 /అక్షరం న్యూస్–

మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 317వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, బి.సి. సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ తురుష్క సైన్యాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన మహానుభావుడని, రాజ్యాధికార సాధనపై ప్రజల్లో చైతన్యం కలిగించారని, బానిస ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారని తెలిపారు. మహనీయుల చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా భావితరాలకు వారి స్ఫూర్తిని అందించవచ్చని అన్నారు. ప్రభుత్వం మహనీయుల వర్ధంతి, జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సి. సమాజ్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి ఎన్. శ్రీనివాస్, బి.సి. సంఘాల ప్రతినిధి కె. లచ్చన్న, గౌడ సంఘం రాష్ట్ర ప్రతినిధి ముఖేష్ గౌడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.లల

# పోలీసులకే సవాల్ విసురుతున్న ఎడ్ల దొంగలు!

- **15 రోజుల్లో రెండు మండలాల్లో వరుస దొంగతనాలు -- రైతుల్లో భయం**

మంచిర్యాల జిల్లా /నెన్నెల, కన్నెపల్లి /ఏప్రిల్ 2 /అక్షరం న్యూస్–

జిల్లాలో ఎడ్ల దొంగతనాలు పెరుగుతుండటం రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. కన్నెపల్లి మండలం వీగాం గ్రామంలో సుమారు 15 రోజుల క్రితం జరిగిన ఎడ్ల దొంగతనం కేసు ఇంకా ఛేదించకముందే, అదే తరహాలో మరో ఘటన నెన్నెల మండలం బొప్పారం గ్రామంలో చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. బుధవారం అర్ధరాత్రి నెన్నెల మండలం బొప్పారం గ్రామంలో కర్ణకొండ చంద్రశేఖర్‌కు చెందిన రెండు ఎడ్లు, నార వెంకన్నకు చెందిన ఒక ఎద్దును గుర్తుతెలియని దుండగులు వాహనంలో ఎక్కించుకుని దొంగిలించారు. ఇదే విధంగా, సుమారు రెండు వారాల క్రితం కన్నెపల్లి మండలం వీగాం గ్రామంలో గాండ్ల తిరుపతికి చెందిన రెండు ఎడ్లు, గాండ్ల వెంకన్నకు చెందిన రెండు ఎడ్లు ఇంటి వద్ద కట్టేసి ఉండగా దొంగలు బొలెరో వాహనంలో ఎక్కించుకుని అపహరించారు. ఈ వరుస ఘటనలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు వారాలు గడిచినా నిందితులు పట్టుబడకపోవడం పోలీసుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఆరుగాలం శ్రమించి, తమ కుటుంబ సభ్యుల్లా ప్రాణప్రదంగా పెంచుకున్న ఎడ్లు కళ్లముందే మాయమవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక్కో రైతుకు లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది. "పెట్టుబడి పెట్టి సాగు చేద్దామనుకుంటే, ఉన్న ఎడ్లను దొంగలు తీసుకెళ్లారు.. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి?" అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరుగుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో పశువుల దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచాలని, నిందితులను వెంటనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ ఘటనలు కేవలం ఈ రెండు గ్రామాల్లోనే జరిగాయా, లేక జిల్లాలోని మరిన్ని ప్రాంతాల్లో కూడా జరుగుతున్నాయా అన్నదానిపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలు వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు.



## చొప్పదండి పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న పెద్దపల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య**
- **పాల్గొన్న సంఘం సభ్యులు**

చొప్పదండి /కరీంనగర్,మార్చి 29 (అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణ పద్మశాలి కుల సంక్షేమ సంఘం,యువజన సంఘం నూతన అధ్యక్షులు పచ్చునూరి తిరుపతి, అనుమల్ల సత్యం లు,కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన కార్యదర్శిగా వల్లాల జగన్, కోశాధికారిగా దండె సత్యానందం తో పాటు యువజన సంఘం ప్రధానవకార్యదర్శిగా గుండేటి వెంకటరమణ, కోశాదికారిగా పొరండ్ల నితీష్, మిగతా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్షులు మాట్లాడుతూ పద్మశాలి అక్షయపాత్ర, పద్మశాలి కులం కమిటి హాల్, పద్మశాలి కుబుంబ సభ్యులను కలుపుకొని పాలనను కొనసాగిస్తానని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి పెద్దపెల్లి ఆర్డీవో బొద్దుల గంగయ్య ముఖ్య అతిథిగా హాజరుకాగా,జిల్లా అధ్యక్షులు మెతుకు సత్యం, కరీంనగర్ కార్యవర్గం నగరపాలిక కరీంనగర్ 18వ వార్డు కార్పోరేటర్ వాసాల రమేష్,17వ వార్డు కార్పోరేటర్ వేముల కవిత-చంద్రశేఖర్,మాజీ కౌన్సిలర్ స్వర్గం నర్సయ్య, జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గుడిమల్ల శ్రీకాంత్ ,జిల్లా యువజన ఉపాధ్యక్షులు మెతుకు చైతన్య క్రిష్ణ, కరీంనగర్ పట్టణ ఉపాధ్యక్షులు ఎలిగేటి శ్రీనివాస్, పద్మశాలి జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లాల క్రిష్ణహరి ,ఎలిగేటి తిరుపతి, గౌరవ అధ్యక్షులు దండె రాజయ్య, ఎన్నం మునిందర్, దూస రాము, బోగ హరికిషన్,వల్లాల నగేష్, మంచికట్ల విఠల్,మల్లేశం, మారం శ్రీపెల్లి నాగభూషణం, దండె లింగన్న సిరిపురం ఆనందం, కొక్కుల కనుకయ్య, అనుమల్ల రమేష్, సిరిపురం చిన గంగారాం, పట్టణ, యువజన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఎలక్షన్స్ ఆఫీసర్స్ కళ్యాణడపు శంకరయ్య,దూస లక్ష్మినర్సయ్య, ఉడుత శంకరయ్య, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.





## తెలంగాణ--II ప్రాజెక్టుకు 800 మెగావాట్ల పీపీఏ ఒప్పందం



జ్యోతి నగర్ ఎన్టిపిసి ఏప్రిల్ 2: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

దేశంలోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎన్టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మితమవుతున్న తెలంగాణ--×× (స్టేజ్--2) ప్రాజెక్టుకు సంబంధించిన కీలక ముందడుగు పడింది. ఈరోజు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు)తో 800 మెగావాట్ల సామర్థ్యానికి సంబంధించిన విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) కుదిరింది. ప్రస్తుతం ఎన్టీపీసీ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ లో 800 మెగావాట్ల రెండు యూనిట్ల లో విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. అయితే తెలంగాణ రాష్ట్ర విభజన ఒప్పందంలో భాగంగా నాలుగు వేల మెగా పట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను తెలంగాణలో ఎన్టిపిసి ద్వారా స్థాపించాలని ఒప్పందం చేశారు. ఈ మేరకు 2016లో 800 వేగావాట్ల రెండు యూనిట్లను ఆనాటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఇంకో 2400 మెగావాట్ల విద్యుత్పత్తి చేయడానికి ఎన్టిపిసి సిద్ధంగా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకోలేదు. అతి కష్టం మీద ఒక యూనిట్ మాత్రం ఇటీవల చేసుకున్నది. ఈ క్రమంలో తెలంగాణ డిస్కంలో కూడా గురువారం ఒక పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్తులో స్థిరమైన మరియు నమ్మదగిన విద్యుత్ సరఫరా అందే అవకాశాలు మెరుగుపడనున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ 800 మెగావాట్ల విద్యుత్ రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా మారనుంది.తెలంగాణ--×× ప్రాజెక్టు ఎన్టిపిసి లిమిటెడ్ విస్తరణలో భాగంగా అభివృద్ధి చేయబడుతోంది. ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తిలో ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. కొత్త యూనిట్ ప్రారంభంతో విద్యుత్ లోటు సమస్యలను అధిగమించడంలో ప్రభుత్వం మరింత బలంగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.పీపీఏ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో, ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగవంతం అయ్యే అవకాశం ఉంది. అలాగే ఈ యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి అదనపు సామర్థ్యం లభించి, వ్యవసాయం, పరిశ్రమలు మరియు గృహ వినియోగానికి స్థిరమైన విద్యుత్ అందించడంలో దోహదం చేయనుంది.మొత్తంగా, ఈ ఒప్పందం తెలంగాణ విద్యుత్ రంగంలో మరో కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి/ఏప్రిల్ 2/ఏప్రిల్ 2/అక్షరంన్యూస్:

ఎల్లారెడ్డి ప్రాథమిక సహ కార సంఘం పరిధిలోని గ్రామాలలో గురు వారం వరిధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రా రంభించారు ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని ఎల్లారెడ్డి గండిమాసానిపేట్ అడవిలింగాల్ ల క్ష్మాపూర్ శివనగర్ మీసానిపల్లి బిక్కనూరు మీసంపల్లి-2 గ్రామాలలోవరి ధాన్యం కొను గోలు సెంటర్లను ప్రారంభించారు ఈ కార్యక్ర మంలోఆయాగ్రామాలసర్పంచ్ లు గ్రామ పె ద్దలురైతులుసొసైటీ పాల్గొన్నారు

## అమృత్ 2.0 పనులు వేగవంతం చేయాలి
## అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



మంచిర్యాల జిల్లా /బెల్లంపల్లి /ఏప్రిల్ 2 /అక్షరం న్యూస్–

వేసవికాలం సమీపిస్తున్నందున ప్రజలకు త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపాలిటీలో అమృత్ 2.0 పనుల పురోగతిని ఆకస్మికంగా సందర్శించి పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న త్రాగునీటి సరఫరా, పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు నిరంతరం త్రాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య శాఖ డి.ఈ.ఈ.ను ఆదేశించారు. పనులను వేగవంతం చేసి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని, ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు.ప్రజలకు మెరుగైన త్రాగునీటి సదుపాయం కల్పించడమే అమృత్ 2.0 ప్రధాన లక్ష్యమని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ సమయపాలనతో పనులు పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డాఫోడిల్స్ విద్యార్థికి బెస్ట్ కేడెట్ అవార్డు

- **కమాండింగ్ ఆఫీసర్ ఎస్.ఎస్. రామాద్రయి చేతుల మీదుగా అవార్డు, బ్యాంక్ చెక్ అందజేత**
- **ఎన్‌సీసీలో ప్రతిభ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు గుర్తింపు**
- **విద్యతో పాటు ఎన్‌సీసీకి ప్రాధాన్యం ఇస్తున్న డాఫోడిల్స్‌కు ప్రత్యేక గుర్తింపు**



వరంగల్ అక్షరం ప్రతినిధి ఏప్రిల్ 02

వరంగల్‌లోని 10(టి ) బెటాలియన్ ఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నర్సంపేట డఫోడిల్స్ పాఠశాలకు చెందిన విద్యార్థి బి. విశాల్‌కు 'బెస్ట్ కేడెట్ అవార్డు లభించింది. కమాండింగ్ ఆఫీసర్ ఎస్.ఎస్. రామాద్రయి చేతుల మీదుగా అవార్డు తో పాటు బ్యాంక్ చెక్‌ను అందజేశారు.పదో తరగతి చదువుతున్న విశాల్ ఎన్‌సీసీ కార్యక్రమాల్లో చూపిన ప్రతిభ, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలకు గాను ఈ గౌరవాన్ని అందుకున్నాడు.ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ ఎస్.ఎస్. రామాద్రయి మాట్లాడుతూ....ఎన్‌సీసీ విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ గుణాలను పెంపొందించే గొప్ప వేదిక అని తెలిపారు. యువతను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.డాఫోడిల్స్ పాఠశాల విద్యార్థి బి. విశాల్ ఈ అవార్డు అందుకోవడం పాఠశాలలో అందిస్తున్న శిక్షణ, మార్గదర్శకత్వానికి నిదర్శనమని కొనియాడారు. విద్యతో పాటు ఎన్‌సీసీ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థులను సమగ్రంగా అభివృద్ధి చేసే విధంగా డాఫోడిల్స్ పాఠశాల ముందంజలో ఉందని పాఠశాల చెర్మన్ చింతల నరేందర్ ను ప్రశంసించారు.ఈ కార్యక్రమం లో ఎన్ సి సి ఆఫీసర్ క్యాడేట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## 4 వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డ్ సభ కార్యక్రమం



చొప్పదండి /కరీంనగర్,ఏప్రిల్ 02( అక్షరం న్యూస్ )

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, చొప్పదండి శాసన సభ్యులు డా మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డ్ సభ కార్యక్రమం లో భాగంగా చొప్పదండి పట్టణ కేంద్రంలో 4వ వార్డ్ పరిధి లోని సాయిబాబా గుడి దగ్గర లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నర సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు పూర్తిగా వివరించి మన 4 వార్డ్ లోనీ వార్డ్ సమస్యల గురించి వార్డ్ ప్రజలతో చర్చించి,ఇందిరమ్మ ఇండ్లు, నూతన పెన్షన్ పథకంలను 4వ వార్డు కౌన్సిలర్ కనుమల్ల రాజశేఖర్ దరఖాస్తులను స్వీకరించారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముద్దం మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారి అఖిల్ గౌడ్, సోమిడి శ్రీనివాస్, మున్సిపల్ వార్డు అధికారి రమాదేవి, ఆర్ పి రొడ్డవేని లక్ష్మి వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



ఓదెల/ పెద్దపల్లి ఏప్రిల్ 02

(అక్షరం న్యూస్) తెలంగాణ సాయుధ పోరాట యోధులు బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన సర్దార్ పాపన్న గౌడ్ పలువురు కొనియాడారు ఈ సందర్భంగా ఓదెల గ్రామంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు నాగపురి రవి గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ సతీష్ కనకి రెడ్డి హాజరయ్యారు మాట్లాడుతూ బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఔరంగాజేబు తెలంగాణ సాయుధ పోరాట యోధులు కోసం పోరాడి దొరల అరాచకాలను మొగులాయి దౌర్జన్యాలను బెదిరించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు నిజంగా అంతటి వ్యక్తి వర్ధంతి జరుపుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు ఈ కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్. గౌడ సంఘం ఉపాధ్యక్షులు మంచాల మహేందర్ గౌడ్ సర్పంచ్ కనకి రెడ్డి సతీష్. ఉప సర్పంచ్ భూపతి శ్రీలత ప్రవీణ్ గ్రామ కార్యదర్శి వెంకట లక్ష్మణ్ సభ్యులు గౌడ కుల బాంధవులు నాగపూర్ పైడి లాస్ మార్క సదానందం మార్క సతీష్ మార్క రవికుమార్ మార్క రమేష్. మార్గ సాయి కోటగిరి స్వామి తో పాటు మహిళలు సంఘ సభ్యులు పాల్గొన్నారు

## చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా

# సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

- **సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /2 ఏప్రిల్/ అక్షరం న్యూస్ :

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు.కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు ఆ ప్రభుత్వం చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,సీఐ జితేందర్,చుంచుపల్లి ఎస్సైలు రవి,ఉమ మరియు ఎస్సై జుబేదా,సిబ్బంది పాల్గొన్నారు.






# గ్రామసభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోంది

- **ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా గ్రామసభల నిర్వహణ**
- **విద్య, వైద్యం, సంక్షేమంతో గ్రామాభివృద్ధి సాధ్యం.. జిల్లా కలెక్టర్ అంకిత్.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/2 ఏప్రిల్/ అక్షరం న్యూస్:

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి అవగాహన కల్పించే వేదికగా ఈ గ్రామసభలు ఉపయోగపడతాయని అన్నారు . ముఖ్యంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పింఛన్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను గ్రామ, వార్డు స్థాయిలో విస్తృతంగా వివరిస్తున్నట్లు తెలిపారు.త్వరలో ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మరియు అల్పాహారం వంటి కొత్త పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు, అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.వైద్య సేవల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. అశ్వాపురం గ్రామంలో అమలు చేసిన పథకాల వివరాలను వెల్లడిస్తూ,రైతు భరోసా కింద 1,369 మందికి రూ. 2.34 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు కింద 58 మందికి రూ. 2.90 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా రూ. 75.58 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు .గ్యాస్ సబ్సిడీ కింద 1,000 మందికి రూ. 20.11 లక్షలు, చేయూత పింఛన్ల ద్వారా 803 మందికి రూ. 19.33 లక్షలు అందించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 1,156 మంది లబ్ధి పొందినట్లు చెప్పారు.కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ కింద 153 మందికి రూ. 82.09 లక్షలు, 1,235 రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 585.69 లక్షలు, వడ్డీ లేని రుణాలుగా రూ. 28.14 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించి, వాటి అమలుపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు.గ్రామసభల్లో స్థానిక సమస్యలపై చర్చించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి తీర్మానాలు చేయాలని సూచించారు. ఈ వివరాలను ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఉ న ్న తా ా ది . s ా ం ు ల s ు నివేదించాలన్నారు.గ్రామస్థాయిలో ప్రజల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్, , మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంఈఓ వీరాస్వామి, తాసిల్దార్, అన్ని శాఖల అధికారులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## సీతరామ స్వాముల కల్యాణ మహోత్సవం

- **సతీ సమేతంగా కళ్యాణం నిర్వహించిన ఎమ్మెల్యే విజయరమణ రావు**



ఓదెల/ పెద్దపల్లి ఏప్రిల్ 02(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని రూపు నారాయణపేట గ్రామంలో చిన్న హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం రోజున సాయంత్రం తన స్వగృహం నుండి సీతరామచంద్రుల స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించి అనంతరం గ్రామస్తులతో కలిసి శ్రీ.సీతారామ చంద్రుల కల్యాణ మహోత్సవ వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్, శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ చైర్మన్లు మరియు పలు గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ పార్టీ పలు మండలాల అధ్యక్షులు మరియు భక్తులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.





## గ్రామ సభలతో ప్రజల సమస్యలకు పరిష్కారం: అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



మంచిర్యాల జిల్లా /తాండూరు /ఏప్రిల్ 2 /అక్షరం న్యూస్-

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లాలోని తాండూర్ మండలం కిష్టంపేట, తాండూర్ గ్రామపంచాయతీలలో నిర్వహించిన గ్రామ సభలకు ఆయన అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన--ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామ సభలు, మున్సిపల్ కార్పొరేషన్ల డివిజన్లు, మున్సిపాలిటీల వార్డుల్లో వార్డు సభలు నిర్వహించామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, వాటి ప్రగతి వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నామని చెప్పారు.గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు రాయితీ గ్యాస్, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార ప్రోత్సాహం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా పలు పథకాల లబ్దిదారులు తమ అనుభవాలను వెల్లడించగా, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యుత్, పంచాయతీ, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంత ఎస్సీలది ధర్మపోరాటం

- రాజ్యాంగ హక్కుల అమలుకు ఏజెన్సీ ఎస్సీలు ఉద్యమించాలి
- స్థానిక సంస్థల స్థానాల్లో ఎస్సీలు పోటీ చేసే వెసులుబాటు కల్పించండి
- అనాదిగా ఎస్సీల సాగులో ఉన్న భూములకు హక్కులు కల్పించాలి
- జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు అన్నిరంగాల్లో 20శాతం రిజర్వేషన్లు కల్పించండి
- బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీలో పాలకులు నిర్లక్ష్యం వహించడం తగదు
- ఎస్టీ, ఎస్సీల ఐక్యతతోనే ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి సాధ్యం
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /2 ఏప్రిల్ / అక్షరం న్యూస్ : ఏజెన్సీ ప్రాంత ఎస్సీలది ధర్మపోరాటమని, దశాబ్దాలుగా సాగుతున్న వివక్షను అంతం చేసేందుకు రాజ్యాంగ హక్కుల అమలు కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం పట్టణంలో షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ అనంతరం జరిగిన ధర్మ పోరాట సభలో ఆయన ప్రసంగిస్తూ..ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీలు సామాజికంగా, రాజకీయంగా తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు లభిస్తున్న ఫలాలు గానీ, వారి హక్కులకు గానీ ఎలాంటి భంగం కలిగించకుండానే, అదే ప్రాంతంలో తరతరాలుగా జీవిస్తున్న ఎస్సీలకు న్యాయం జరగాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలు, ఎస్సీలు అనాదిగా సోదరభావంతో కలిసి మెలిసి ఉంటున్నారని, వారి మధ్య చిచ్చు పెట్టకుండా ఇరువురికి సమానమైన హక్కులు కల్పించేలా పాలకులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ సాకుతో ఎస్సీలకు కనీస రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయడం సరికాదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వెసులుబాటు కల్పించాలన్నారు. అనాదిగా ఎస్సీల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇచ్చి హక్కులు కల్పించాలని, జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో 20 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడవద్దని, అణగారిన వర్గాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీలకు ఇచ్చిన హామీలు అమలుచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. ఏజెన్సీ ఎస్సీల ఆత్మగౌరవం చాటేలా ఈ పోరాటాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సభలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జేఏసీ నాయకులూ బొమ్మెర శ్రీనివాస్, మద్దెల శివకుమార్, కుసపాటి శ్రీను, గుండా రమేష్, ఇనుముల వెంకటేశ్వర్లు, ఎనగంటి కృపాకర్, జిల్లా నాయకులు మీసాల రాములు, కొంకటి కృష్ణ, చిలుములగోపి కిరణ్,కర్లపూడి సుందర్ పాల్, సలిగంటి కొమరయ్య, ఎనగంటి శ్రీను, వేల్పుల భాస్కర్, ముచ్చ సుధాకర్, ఉండేటి దేవరాజు, కొప్పుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.






# భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ అంకిత్.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/2 ఏప్రిల్/ అక్షరం న్యూస్: జిల్లాలో భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పెండింగ్ దరఖాస్తులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి భూ సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రతి సమస్యను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను బీఎల్ఓల వారీగా, మండలాల వారీగా విభజించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని, ప్రతి బీఎల్ఓకు లక్ష్యాలను నిర్దేశించి సమయానికి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనగణనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, తహసీల్దారుల ఐడీ క్రియేషన్‌ను వేగవంతం చేయాలని, జనగణన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, ఇసుక రీచ్‌ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పురోగతి, పెండింగ్ కోర్టు కేసులపై కూడా సమగ్ర సమాచారం కోరారు. వచ్చే వారంలో జిల్లాలోని అందరు తహసీల్దారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్, జనగణన, భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఇందుకు అవసరమైన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, ఏడి మైన్స్ దినేష్, భూసేకరణ అధికారి యాసిన్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# మహిళా సాధికారతకు చేదోడుగా 'ఉచిత బస్సు' సౌకర్యం

- పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం
- ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు
- శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
- ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు
- ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/2 ఏప్రిల్/ అక్షరం న్యూస్:

మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్య లక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.






# సర్వారంలో పబ్లిక్ రీడింగ్ రూమ్ ఏర్పాటు

- పాల్గొన్న టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/2 ఏప్రిల్ /అక్షరం న్యూస్:

సుజాతనగర్ మండలం సర్వారం గ్రామంలో గ్రంధాలయ రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు పాల్గొన్నారు. స్థానిక సర్పంచ్ సర్పంచ్ సునీత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతు గ్రంథాలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని పుస్తకాలు, అందించి సమాజ అభివృద్ధి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ మాజీ చైర్మన్ మండే వీర హనుమంతురావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, గ్రంధాలయ జిల్లా సెక్రటరీ కరుణ కుమారి, ఆఫీస్ ఇంచార్జి నవీన్ కుమార్, స్థానిక యువత, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# జిల్లాస్థాయి రీడింగ్ ఛాంపియన్ పోటీలలో తృతీయ బహుమతి పొందిన శాన్విత





ఓదెల/ పెద్దపల్లి ఏప్రిల్ 02(అక్షరం న్యూస్)

జిల్లాస్థాయి రీడింగ్ ఛాంపియన్ పోటీలో ద్వితీయ బహుమతి పొందిన అశ్వీత అశ్వీత పెద్ద కొమిర మండల పరిషత్ పునాత పాఠశాలలో ఫస్ట్ క్లాస్ చదువుతున్నది. ఈ అమ్మాయి ధృతి బహుమతి పొందిన విద్యార్థిని పలువురు అభినందించారు ఇంత చిన్న వయసులోనే ఇలాంటి బహుమతి పొందినందుకు పెద్దకొమిర ప్రజలు నాయకులు హర్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారుఅదేవిధంగా మార్చి 20న మండలంలోని కాంప్లెక్స్ స్థాయిలో మూడో నాలుగు ఐదు మరియు ఒకటి రెండు తరగతుల ఇంగ్లీషులో రీడింగ్ పోటీలు నిర్వహించబడినవి ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఓదెల కాంప్లెక్స్ నుండి మూడు నాలుగు ఐదు తరగతిల విభాగములకు శాంభవి ఎంపీ యూపీఎస్ ఉప్పరపల్లె హర్షిత్ మండల పరిషత్ పాఠశాల నాంసానిపల్లి అదేవిధంగా ఒకటి రెండు తరగతుల విభాగములలో మండల పరిషత్ ఉన్నత పాఠశాల అశ్వీత కొమిర అదేవిధంగా ఆయేషా మండల పరిషత్ పాఠశాల కొలనురు విద్యార్థులు గెలుపొందడంతో వారికి అభినందిస్తూ వారి యొక్క పోటీ తత్వాన్ని హర్షిస్తూ అభినందనలు తెలియజేశారు.

# జగన్.....చపలచిత్త రాజకీయాలు !



హైదరాబాద్, ఏప్రిల్ 2 ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజకీయాలు సూస్తుంటే ..ఇంతటి అపరిపక్వ రాజకీయ నేతను చూసి ఉండమేమో అనిపిస్తుంది. చంద్రబాబు మీద వ్యతిరేకత ఉన్నవారు సైతం రాజధాని విషయంలో వ్యతిరేకించడం లేదు. ఏ విషయంలోనూ స్పష్టత లేని జగన్ ఐదేళ్ల పాటు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అతి తక్కువ సమయంలో సిఎంగా ప్రజలు ఆదరిస్తే, దానిని అద్భుత అవకాశంగా తీసుకుని, దార్శనికతను ప్రదర్శిం చాల్సిన జగన్, తన ఫ్యాక్షన్ రాజకీయతనుజోడించి అభాసుపాలయ్యారు. అధికారంలో ఉండగా మూడు రాజధానులు అంటూ, రాజధాని రైతులను రాచిరంపాన పెట్టారు. అమరావతి ని వేశ్యల రాజధాని అన్నారు. అదో కమ్మ సామ్రాజ్యం అన్నారు. మూడు రాజధానులంటూ ఊదరగొట్టి, అసలు రాజధాని లేకుండా ఐదేళ్లు కాలం గడిపారు. ఇప్పుడేమో మావిగన్ అంటూ జగన్ కొత్త పల్లవి అందుకున్నారు. ఇవన్నీ చూస్తుంటే జగన్‌లో ఓ అపరిచితుడు ఉన్నాడా అన్న అనుమానాలు కలుగు తున్నాయి. రాజధాని అమరావతి రైతులకు న్యాయం జరగడం లేదంటున్న వ్యక్తి, తన సొంతింట్లో సొంత చెల్లెలికి మాత్రం న్యాయం చ ఏయడం లేదు. హక్కుగా ఉన్న ఆస్తిని పంచడం లేదు. తల్లి చెప్పినా వినడం లేదు. అంతెందుకు రాజధాని విషయంలో ఏం మాట్లాడుతున్నారో ఆయనకైనా అర్థం అవుతందా అన్నది అర్థం కావడం లేదు. మూడు రాజధానులు అన్నారు. అసలు రాజధాని అవసరం లేదంటున్నాడు. మావిగన్ అంటున్నాడు. అంటే చిత్తశుద్ధి, స్థిర సంకల్పం లేని రాజకీయ నేతగా జగన్‌ను చూడాలి. ఇలాంటి వారు అధికారంలో ఉండగా ఎంతగా తెగించారో చూశాం. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్.. ఇప్పుడు 'ప్లాన్–బి' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారు. విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ నచ్చకపోతే.. ప్లాన్–బీ కింద మచిలీపట్నం (మా) –విజయవాడ (వి)–గుంటూరు (గన్) నగరాలను రాజధానిగా అభివృద్ధి చేయొచ్చని సెలవిచ్చారు. దీనికి ఎంచక్కా 'మావిగన్' అని పేరు పెట్టొచ్చన్నారు. 'గన్'లో తన పేరు ఉన్నందున, అది నచ్చకపోతే ఇంకోపేరు పెట్టుకోవచ్చని కూడా సలహా ఇచ్చారు. మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు మధ్య 110 కిలోమీటర్ల హైవే ప్రాంతం పరిధిలో 110 ఎకరాల్లో రాజధాని నగరాన్ని ఏర్పాటు చేయొచ్చని జగన్ పేర్కొన్నారు. 'మావిగన్'పై తన అభిప్రాయాన్ని విన్నాక .. రాష్ట్ర ప్రజలు తనతో ఏకీభవిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అమరావతి మాత్రం ఆచరణ సాధ్యం కాదని తేల్చేశారు. భవిష్యత్తులో తమ ప్రభుత్వం వచ్చాక అసెంబ్లీలో చట్ట సవరణ ద్వారా రాజధానిని మార్చేస్తామని కూడా ప్రకటించారు. గతంలో తుగ్లక్ కూడా ఇలాగే చేశారు. ఇష్టం వచ్చినట్లుగా రాజధానిని మార్చేశారు. ఇప్పుడు జగన్ చేస్తున్న లేదా చెబుతున్నది అలాగే ఉంది. అంతెందుకు అసలు రాష్ట్రాలకు రాజదాని అసవరం లేదని సెలవిచ్చారు. గతంలో ఆయనగారు తాను అంటే సిఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అన్నారు. దీనిపై మాజీమంత్రి సోమిరెడ్డి సెటైర్లు వేశారు. లాట్రిన్‌లో ఉంటే అదే రాజధాని అవుతుందనుకోవాలా అని ఆన్నారు. రాజ్యాంగంలో దేశ రాజధానిపై నిర్వచనం ఉందే తప్ప.. రాష్ట్రాల రాజధాని ప్రస్తావనే ఎక్కడా లేదని జగన్ చెప్పడం ఆయన అవివేకానికి పరాకాష్టగా చెప్పుకోవాలి. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో చట్ట సవరణ చేసినా నిలువదంటున్నారు. భవిష్యత్‌లో ప్రజాభీష్టం మేరకు ఏర్పడే రాష్ట్రప్రభుత్వం.. రాజధానిని అమరావతి నుంచి మారుస్తూ చట్టసవరణ చేయవచ్చని కూడా సెలవిచ్చారు. అమరావతికి తాను ఏనాడూ వ్యతిరేకం కాదని, అందుకే శాసన రాజధానిగా ఏర్పాటు చేశానని తెలిపారు. అమరావతికి ఏ ఒక్కరూ వ్యతిరేకం కాదని, రాజధాని పేరిట చేస్తున్న అవినీతికే వ్యతిరేకమని చెప్పారు. అమరావతిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కంటే తానే ఎక్కువ కాలం కాపురం చేశానని జగన్ చెప్పుకున్నారు. తనకు అమరావతిపై అభిమానం ఉందనేందుకు చంద్రబాబు కంటే ముందుగానే తాడేపల్లిలో సొంత ఇల్లు కట్టుకున్నానని.. ప్రస్తుతం అదే భూమిపై ఉండడమే సాక్ష్యమన్నారు. ఇలా అర్థంపర్థం లేని వ్యాఖ్యలు, వాదనలు జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అతనిలోని నిరంకుశ విధానాలు బటయకు వస్తున్నాయి. అధికారంలో ఉంటే ఎంతటి విధ్వంసానికి అయినా తెగిస్తారని ప్రజావేదిక కూల్చివేతతో చూపారు. మద్యపాన నిషేధం పేరుతో మద్యంపై దందా చేశారు. ఒక్కటేమిటి సకల వ్యవస్థలను భ్రష్టు పట్టించి, బటన్ నొక్కుడుతో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారు. అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారు. విశాఖ భీమిలిలో ప్యాలెస్‌లు కట్టుకుని తన రాజరిక పోకడలను చాటారు. అందుకే ఇప్పుడు జగన్ తననకున్న కాస్తా ఇమేజ్‌ను బజారున పడేసుకున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించడం ద్వారా వైసీపీతో పాటు జగన్ జాతీయ రాజకీయాల్లో భ్రష్ట చరిత్రను లిఖించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధానికి సంబంధించిన బిల్లును.. వైసీపీ తప్ప అన్ని పార్టీలూ సంపూర్ణంగా సమర్థించాయి. బిల్లును వ్యతిరేకించొద్దు.. మద్దతు ఇవ్వొద్దన్నది తొలుత వైసీపీ తీసుకున్న నిర్ణయం. అయితే కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు సైతం అమరావతికి మద్దతిస్తూ మాట్లాడడంతో వైసీపీ నాయకత్వానికి దిక్కుతోచలేదు. చివరకు వ్యతిరేకిస్తూ ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబును విమర్శిస్తూ వైసీపీ లోక్‌సభాపక్ష నేత మిథున్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని గానీ.. ఆ పార్టీ ఎంపీల వాకౌట్‌ను గానీ సభలో ఎవరూ పట్టించుకోలేదు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగుస్తున్న వేళ, అకస్మాత్తుగా బిల్లును తెరపైకి తేవడం.. దానికి ముందే అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి పంపాలని స్వయంగా ప్రధాని కార్యాలయం రాష్ట్రప్రభుత్వానికి సూచించడం.. ఆగమేఘాలపై కూటమి ప్రభుత్వం అత్యవసరంగా అసెంబ్లీని సమావేశపరచి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించడం.. శాసనమండలిలో పెట్టనవసరం లేదని తేల్చడం.. ఆ వెంటనే కేంద్రం బిల్లును తీసుకు రావడం.. శరవేగంతో జరిగిన ఈ పరిణామాలతో జగన్ ఉక్కిరిబిక్కిరి అయ్యారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు మతపరమైన, కుటుంబపరమైన వివాదాలు జగన్‌ని చుట్టుముడుతున్న వేళ, ఇప్పుడు అమరావతితో రాజకీయంగా సమాధి తవ్వుకున్నట్లుగానే భావించాలి. వర్తమాన రాజకీయాలలో జగన్ తనవికృత రాజకీయ మేథను ప్రదర్శించి మరొకరు సాటిరారని ప్రచారం చేసుకున్నారు. ఇలాంటి రాజకీయ నేతల వల్ల ప్రజలకు కానీ, రాష్ట్రానికి కానీ మేలు జరగదు. ఫక్తు ఫూడల్ వ్యవస్థకు పునాదిగా జగన్ రాజకీయ ఆలోచనలు అద్దం పడుతున్నాయి.

## చికెన్ బంద్‌తో దిగివచ్చిన పౌల్ట్రీలు

**డిమాండ్లు అంగీకరించినట్లు ట్రేడర్స్ వెల్లడి**



వరంగల్,ఏప్రిల్2 చికెన్ సెంటర్ల బంద్ విజయవంతమైంది. బంద్ దెబ్బకు పౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చాయి. బర్డ్ ధరను రూ.185 నుంచి రూ.125కి తగ్గించాయి. చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఇచ్చే మార్జిన్‌ను గతంలో మాదిరిగానే కిలోకు రూ.15, ఆ పైన మార్జిన్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. దీనితో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చికెన్ సెంటర్ల నిర్వా హకులు బంద్‌ను విరమించుకోవాలని నిర్ణయించు కున్నట్టు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్రాయిలర్ ట్రేడర్స్ అసోసియేషన్ నేతలు తెలిపారు. బంద్ ప్రశాంతంగా జరిగిందని తెలిపారు. బంద్‌ను విజయవంతం చేసినందుకు చికెన్ సెంటర్ల నిర్వాహకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఒక్కరోజు చికెన్ సెంటర్ల బంద్‌తో నాటు కోళ్లకు డిమాండ్ పెరిగింది. బ్రాయిలర్ కోళ్ల అమ్మకాలు లేకపోవడంతో మాంసం ప్రియులు నాటు కోళ్లను ఎక్కువగా కొనుగోలు చేసారు. దీంతో వీరు కూడా ధరలు పెంచి అమ్మారు. నాటు కోడి రేటు ఎక్కువగా ఉంటుంది కనుక సాధారణ రోజుల్లో వీటి అమ్మకాలు తక్కువగా ఉంటాయి. నాటు కోళ్లను ఇష్టపడేవారు మాత్రమే వీటిని కొనుగోలు చేస్తారు. బంద్‌తో నాటు కోళ్ల పెంపకం దారులు వీటిని మార్కెట్‌కు తరలించారు. సాధారణ ధరకన్నా కాస్త ఎక్కువైనా కొనుగోలు చేశారు. చికెన్ సెంటర్ల బంద్‌తో మాంసం విక్రయాలు కూడా 20 నుంచి 25 శాతం పెరిగినట్టు మాంసం విక్రయదారులు తెలిపారు. బుధవారం నుంచి చికెన్ సెంటర్ల బంద్ జరుగుతున్న దృష్ట్యా ముందే మేల్కొన్న మాంసం విక్రయదారులు కాస్త ఎక్కువగానే జీవాలను కోసి ఉదయం నుంచే సిద్ధంగా ఉంచారు. చికెన్ అమ్మకాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా మాంసం కొనుగోలు చేయడానికి ఎక్కువ మంది మొగ్గు చూపారు. చికెన్ సెంటర్ల బంద్‌లో భాగంగా బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన మహా ధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి చికెన్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసు కోవాలని, విధాన పరంగా చికెన్ ధరలు, కమిషన్ మార్జిన్ ధరలు నిర్ణయించాలని, చిల్లర చికెన్ వ్యాపారులు లేకుండా చేయాలని పౌల్ట్రీ కంపెనీలు చేస్తున్న కుట్రను అడ్డుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు.

## బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

- **ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య**
- **చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు**

నారాయణపేట,ఏప్రిల్2 జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్థరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామస్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

## క్యాటరింగ్ పేరుతో దగుల్బాజీ పనులు

**ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు**

హైదరాబాద్,ఏప్రిల్2 చేసేది క్యాటరింగ్ పనే ఐనా..చాటుమాటుగా కంత్రీ పనులు చేస్తున్నాడో కేటుగాడు. ఫంక్షన్లకు క్యాటరింగ్ ఫుడ్ సప్లై చేస్తూ.. ముందుగా మాట్లాడుకున్న దాని కంటే అదనంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడు. ఎందుకుని ప్రశ్నిస్తే ఫంక్షన్లో దొంగచాటుగా మహిళల ఫోటోలు తీసి.. మార్ఫింగ్ చేసి వేధిస్తున్నాడు. సికింద్రాబాద్ అడ్డాగా క్యాటరింగ్ చాటున కంత్రీ పనులకు పాల్పడుతున్న కేటుగాడిని పోలీసులు పట్టుకున్నారు . సికింద్రాబాద్ పరిధిలోని మోండా మార్కెట్‌కి చెందిన వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్ స్థానికంగా క్యాటరింగ్ బిజినెస్ చేస్తున్నాడు. మీటింగ్‌లు, ఫంక్షన్లకు ఫుడ్ సప్లై చేయడమే కాకుండా, వడ్డించేందుకు క్యాటరింగ్ బాయ్స్‌ను కూడా సప్లై చేస్తుంటాడు. మోండా మార్కెట్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి తన ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్ కోసం అంజి కిరణ్ వద్ద క్యాటరింగ్ ఆర్డర్ ఇచ్చాడు. ఆర్డర్ బుకింగ్ సమయంలోనే ప్లేట్ భోజనానికి ఎంత ఛార్జ్ అవుతుంది? ఎన్ని ప్లేట్లు తెస్తారు? ఎంతమంది క్యాటరింగ్ బాయ్స్ వస్తారు? వాళ్లకు ఎంత ఇవ్వాలి? అనేది మాట్లాడుకున్నారు.తీరా ఫంక్షన్ ముగిసిన తర్వాత అంజి కిరణ్ అదనంగా బిల్లు వేశాడు. ఏవేవో ఛార్జీల పేరుతో అదనంగా డబ్బులు డిమాండ్ చేశాడు. ఎందుకు ఇవ్వాలి అని అడిగితే గొడవ పెట్టుకున్నాడు. అసభ్యంగా దూషించాడు. ఫంక్షన్ జరుగుతున్న సమయంలో ఫంక్షన్‌కి అటెండ్ అయిన మహిళల ఫొటోలు తీశానని? వాటిని మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్‌మెయిలింగ్‌కి దిగాడు. దీంతో బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. అంజి కిరణ్‌పై ఫిర్యాదు చేశారు. వన్నూరు స్వామి అలియాస్ అంజి కిరణ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పోలీసులు. ఇదే తరహాలో పలుచోట్ల బెదిరింపులకు, వేధింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు దిగినట్లు గుర్తించారు పోలీసులు. గతంలో ఇలాంటివే రెండు కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. అంజి కిరణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## వాడపల్లిలో వైభవంగా ఉత్సవాలు

**భారీగా హాజరైన భక్తులు**

కోనసీమ,ఏప్రిల్2 కోనసీమ తిరుమలగా ఖ్యాతిగాంచిన వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం నిర్వహించారు. భక్తి, శ్రద్ధల సమ్మేళనంగా తెప్పోత్సవం కొనసాగింది. విశేష పూజలతో పాటు, కన్నుల పండుగగా జరిగింది. వేకువజామున ఆలయ అర్చకుల మేల్కొలుపుతో ప్రారంభమైన ఈ మహోత్సవంలో గౌతమి గోదావరి పవిత్ర జలాలను తెచ్చి స్వామివారికి సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం నిత్యార్చన, నిత్య హోమాలు, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారు అమ్మవార్లకు విశేష పూజారి కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఎంతగానో అలరించాయి. విశేష సంఖ్యలో హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రధాన హోమం అనంతరం స్వామివారిని సన్నాయి మేళాల నడుమ రాత్రి గౌతమి గోదావరి తీరం వైపు తీసుకెళ్లి, అంగరంగ వైభవంగా తెప్పోత్సవాన్ని నిర్వహించారు. నది మధ్యలో సాగిన ఈ తెపోత్సవం భక్తులకు కనుల విందుగా మారి, హృదయాలను భక్తి పరవశంలో ముంచెత్తింది. స్వామివారి కోసం ప్రత్యేకంగా విద్యుత్ పూల అలంకరణలతో రూపొందించిన తెప్ప అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గోదారమ్మ ఒడిలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం అందరిని మంత్రముగ్ధులను చేసింది. ఈ పవిత్ర వేడుకల్లో ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలవకుండా విశేషమైన ఏర్పాట్లు నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు నృత్య ప్రదర్శనలు, కళా ప్రదర్శనలు, కోలాటాలు నిర్వహించారు. సమీప ప్రాంతాలు నుంచే కాకుండా సుదీర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ఈ కార్యక్రమాలు ఆనందాన్ని, ఉల్లాసాన్ని నింపడంతో పాటు భక్తిని కూడా పెంపొందించాయి. భక్తుల గోవింద నామస్మరణల మధ్య సాగిన ఈ మహోత్సవం కోనసీమ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత ప్రతిష్ఠాత్మకంగా నిలిపింది.

## రాష్ట్రప్రజలకు కెసిఆర్ హనుమత్ జయంతి శుభాకాక్షలు

హైదరాబాద్,ఏప్రిల్2 రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సీతారామచంద్రమూర్తి భక్తుడుగా, బలం, జ్ఞానం, వాక్చాతుర్యం అన్నీకలిసి, అరుదైన వ్యక్తిత్వం కలిగిన జ్ఞానిగా, హిందూ పురాణాలు హనుమంతుడిని కీర్తిస్తాయని కేసీఆర్ తెలిపారు. సంత్ తులసీదాస్ తన రామచరిత మానస్‌లో చెప్పినట్టు అంజనీ సుతుడు జ్ఞానినాం అగ్రగణ్యం., అంటే జ్ఞానుల్లో అత్యున్నతుడు..అని కేసీఆర్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణంలో శ్రీరాముడు అన్నట్టు 'న వాక్యదోషం నచ అపశబ్దం'..అంటే., ఎటువంటి దోషాలు లేని భాషతో, ఉచ్చారణతో, వ్యాకరణం మీద పట్టుతో వాక్ శుద్ధితో ప్రసంగించే గొప్ప వక్త హనుమంతుడు అని కేసీఆర్ కొనియాడారు. ధర్మరక్షణ కోసం, తాను నమ్మిన శ్రీ రామునికి తన శక్తినంతా ధారపోసి, ఎటువంటి ప్రతి ఫలాపేక్ష లేకుండా, ప్రజా సంక్షేమం కోసం నాయకత్వాన్ని తన భుజాలమీద మోసిన బలశాలి, వినయానికి ,విజయానికి మార్గదర్శి, మృదుస్వభావి శ్రీ ఆంజనేయ స్వామి అని కేసీఆర్ కొనియాడారు. జ్ఞానం వాక్చాతుర్యం బలం భక్తి వినయం అన్నీ కలెగలిసిన సంపూర్ణ వ్యక్తిత్వం హనుమంతుడికే సాధ్యం అన్నారు. వారి ఆచరణ ఎల్లకాలం ఆదర్శనీయమని, నేటి యువతరానికి ఆచరణీయమని కేసీఆర్ తెలిపారు.

## కాంగ్రెస్ మోసాలను సోషల్ మీడియాతో ఎండగట్టాలి

**పార్టీ శ్రేణులకు హరీష్ రావు పిలుపు**

సంగారెడ్డి,ఏప్రిల్2: కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం బొల్లారంకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ ఆరిఫ్ తో పాటు మరో 25 మంది సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బాలరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరార. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..ప్రస్తుత రాజకీయాల్లో ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలంటే సోషల్ మీడియాలో అత్యంత చురుకుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియానే నేడు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యంగా రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసింది. ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి గ్దదెనెక్కి, అధికారంలోకి వచ్చాక నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదు. వారు చెప్పిన రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. యువతతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించిందని మండిపడ్డారు. అవ్వాతాతలకు పెన్షన్లు పెంచకుండా, కోటి మంది మహిళలకు నెలకు రూ. 2500 ఇవ్వకుండా, రైతన్నలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా ప్రతి వర్గాన్ని దారుణంగా మోసం చేసింది. ఈ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మీలాంటి యువత ముందుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలి. కాంగ్రెస్ చేస్తున్న ప్రతి

మోసాన్ని సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజలందరికీ తెలిసేలా చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు పార్టీ ఇన్‌ఛార్జి ఆదర్శ్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## దోమతెర కప్పకుని ఎమ్మెల్యే నిరసన

హైదరాబాద్,ఏప్రిల్2 నగరంలో దోమల సమస్యను ప్రభుత్వానికి తెలియచేసేందుకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్నంగా రంగంలోకి దిగారు. దోమల బాధకు వ్యతిరేకంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దోమ తెర ధరించి, ఫాగింగ్ యంత్రంతో అసెంబ్లీ వద్దకు వచ్చారు. అనుమతి లేదని ఎమ్మెల్యేను మార్షల్స్ అడ్డుకున్నారు. ఆయన వద్ద నుంచి దోమ తెర లాక్కునేందుకు యత్నించారు. దీంతో మార్షల్స్‌పై సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగని సమయంలో కొత్త నిబంధనలు ఎక్కడివని ప్రశ్నించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ దోమల తీవ్రతకు ప్రజలు హైదరాబాద్ నుంచి పారిపోతున్నారని వ్యాఖ్యానించారు. దీనివల్ల నగరం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని చెప్పారు. దోమల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

హైదరాబాద్,ఏప్రిల్2 రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం నర్సాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో వెళుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు సోదరులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కోల్‌కతాపై హైదరాబాద్ ఘన విజయం

**'ట్రావిషేక్' మెరుపులు**

**రాణించిన క్లాసెన్, నితీశ్**




కోల్‌కతా: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ నిర్దేశించిన 227 పరుగుల లక్ష్యఛేదనలో కోల్‌కతా 16 ఓవర్లలో 161 పరుగులకు కుప్పకూలింది. జైదేవ్ ఉనద్కత్(3/21), ఇషాన్ మలింగ(2/14), నితీశ్‌కుమార్(2/17) ధాటికి నిలదొక్కుకోలేకపోయింది. రఘువంశీ(52) మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్.. హెన్రిచ్ క్లాసెన్ (35 బంతుల్లో 52, 4 ఫోర్లు, 1 సిక్స్), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48, 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), ట్రావిస్ హెడ్ (21 బంతుల్లో 46, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 226 రన్స్ చేసింది. +వశీస్త్రతీఖజూష్ట్రఅఎ =వటవతీవఅఎవ

**జూలు విదిల్చారు..**

పవర్ ప్లేలో ఓపెనర్ల మెరుపులు.. మిడిల్ ఓవర్లలో నిలకడ.. ఆఖర్లో మళ్లీ ధనాధన్.. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్ సాగిన తీరిది! మ్యాచ్ ఆరంభం నుంచే ప్రత్యర్థుల మీదకు దండెత్తే ఓపెనింగ్ జోడీ ట్రావిషేక్.. రెండో ఓవర్ నుంచి బాదుడు మంత్రాన్ని జపించింది. ముజరబాని ఓవర్లో హెడ్ రెండు బౌండరీలు బాదగా అభిషేక్ సిక్స్‌తో వీరి దంచుడు మొదలైంది. వైభవ్ మూడో ఓవర్లో అయితే హెడ్ 4, 6, 6, 4తో 21 పరుగులు పిండుకున్నాడు. వరుణ్ నాలుగో ఓవర్లో అభిషేక్ 6, 4, 4, 4తో 25 రన్స్ రాబట్టాడు. త్యాగి ఐదో ఓవర్లో ఫోర్, సిక్స్‌తో హాఫ్ సెంచరీకి చేరువైన హెడ్.. నాలుగో బంతికి గ్రీన్ చేతికి క్యాచ్ ఇవ్వడంతో 82 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

ఇషాన్.. (14) కూడా వస్తూనే హ్యాట్రిక్ బౌండరీలతో విరుచుకుపడ్డాడు. కానీ ముజరబాని 9వ ఓవర్లో ఇషాన్‌తో పాటు అభిషేక్ ఔట్ అవడంతో స్కోరువేగం తగ్గింది. ఈ క్రమంలో క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డి (39) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపారు. 13-17 ఓవర్లలో కోల్‌కతా బౌలర్లు కట్టడి చేయడంతో సన్‌రైజర్స్ స్కోరువేగం తగ్గినా.. ఆఖర్లో క్లాసెన్, హర్ష్ దూబే (9లి) అండతో స్కోరును 220 మార్కును దాటించాడు.

**కోల్‌కతా ధమాల్:**

రికార్డు ఛేదనలో ఫిన్ అలెన్ (7 బంతుల్లో 28, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో కోల్‌కతా కూడా ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించింది. 4, 4, 6, 6, 4తో మొదటి ఓవర్లోనే 24 రన్స్ రాబట్టిన అతడిని రెండో ఓవర్లో దూబె బోల్తా కొట్టించడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది. రహానే (8)ను ఉనద్కత్, మలింగ బౌలింగ్‌లో గ్రీన్ (2) రనౌట్ అయినా రఘువంశి పోరాడాడు. పరిణితితో కూడిన ఆటతో జట్టును ముందుకు నడిపిన అతడు.. 27 బంతుల్లో వరుసగా రెండో అర్ధశతకాన్ని నమోదుచేశాడు. అయితే రింకూతో సమన్వయం లోపం కారణంగా అతడు రనౌట్ .

ఆ తర్వాత నితీశ్ వరుస ఓవర్లలో అనుకుల్, రింకూ (35)ను ఔట్ చేయడంతో ఆ జట్టు ఓటమి దాదాపుగా ఖాయమైంది. ఒక దశలో విజయం వైపు సాఫీగా నడిచిన కోల్‌కతా..హైదరాబాద్ బౌలర్ల సమష్టి ప్రదర్శనతో వికెట్లు కోల్పోయి ఓటమి వైపు నిలిచింది. సునీల్ నరైన్(12), రమణ్‌దీప్‌సింగ్(10)ను మలింగ ఒకే ఓవర్‌లో ఔట్ చేయగా, చక్రవర్తిని క్లీన్‌బౌల్డ్ చేసి కోల్‌కతా ఇన్నింగ్స్‌కు జైదేవ్ ముగింపు పలికాడు.

# మా ఇంట్లో ఆంజనేయుడిపై సూర్యకిరణాలు



ప్రత్యేక వీడియో పంచుకున్న మెగాస్టార్ చిరంజీవి

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంజనేయస్వామికి పరమభక్తుడనే విషయం తెలిసిందే. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయన ఒక ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. తన ఇంటిలోని పూజా మందిరంలో చోటుచేసుకొన్న ఓ అపురూప దృశ్యాన్ని ఈ వీడియోలో చూపించారు. ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవానుడి కిరణాలు మా ఇలవేల్పు హనుమంతుడిని స్పృశిస్తున్న అద్భుతమైన సన్నివేశాన్ని మీతో పంచుకుంటున్నాను' అని ఆయన ఈ వీడియో షేర్ చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా మా పూజా మందిరంలో జరిగిన ఒక విశేషాన్ని మీతో పంచుకోవాలని ఈ వీడియో చేస్తున్నా. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూర్యకిరణాలు సప్త వర్ణాలుగా మారి మా పూజా మందిరంలో ఉన్న హనుమంతుడిని స్పృశిస్తూ ప్రసరించడం చూస్తుంటే ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఇటీవల మనం అయోధ్యలో బాలరాముడి నుదిటిపై సూర్యకాంతి పడి మెరిసిన అద్భుతాన్ని చూశాం. అలాగే కోణార్క్, అరసవల్లి దేవాలయాల్లో కూడా సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే. అలాంటి దైవానుభూతి మా ఇంట్లోనూ ఆంజనేయుడిని స్పృశించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా' అని చిరంజీవి తెలిపారు. అనంతరం అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు చెప్పారు.



# వార్డు సభలు విజయవంతం



కామారెడ్డిజిల్లా/ఎల్లారెడ్డి/ఏప్రిల్ 2/అక్షరం న్యూస్:ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 2వ10వ వార్డులలో తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం వార్డు సభలువిజయవంతంగా నిర్వహించ బడ్డాయి99రోజులయాక్షన్ ప్లాన్‌లోభాగం గా నిర్వహించినఈ సభలోప్రభుత్వం అమ లు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై ప్రజ లకుఅవగాహనకల్పించారుఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు మహిళలకు ఉచిత బస్ ప్రయాణంరూ.500కే గ్యాస్ సిలిండర్ సన్న రకం వడ్ల కొనుగోలు పెన్షన్లు గృహజ్యోతి క ళ్యాణలక్ష్మిషాదిముబారక్ కొత్త రేషన్ కార్డు లుతదితర పథకాలపైవిస్తృతంగాచర్చించా రు అలాగే వార్డులలో చేపట్టినఅభివృద్ధి ప నులపై సమీక్ష నిర్వహించారురాబోయే వ ర్షాకాలాన్నిదృష్టిలోఉంచుకునిలోతట్టు ప్రాం తమైనబీసీకాలనీలో చేపట్టవలసినముంద స్తు చర్యలపైకాలనీవాసులతో చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అర్హులై న ప్రతి కుటుంబానికి ఈ పథకాలు చేరేలా కృషిచేయాలని తీర్మానించారు అనంతరం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ కమిషనర్ మహేష్ మాట్లాడుతూ ప్రజలసంక్షేమమే ప్ర భుత్వ ప్రధానలక్ష్యమని తెలిపారు ప్రతి అ ర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చే స్తామని రాబోయే కాలంలో ఆరోగ్యం పరిశు భ్రత విద్యఉపాధిఅవకాశాలుక్రీడల ప్రోత్సా హం మహిళా శిశు సంక్షేమంపర్యావరణ ప రిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారుతెలంగాణఅభివృద్ధి దిశగా క్యూర్ ప్యూర్ రేర్ భావనతో ముందుకు సా గుతోందని తెలిపారుఈ కార్యక్రమంలో ము న్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ వార్డు కౌన్సిల ర్ మంచిర్యాలమహేశ్వరివిద్యాసాగర్ కమి షనర్ మహేష్ఎంఈఓ రాజులువార్డు ఆఫీ సర్ అవినాష్ విద్యుత్ ఏఈ లైన్ మెన్‌ఆర్పి రేఖ అంగన్వాడి టీచర్ నుస్రత్ తదితరు లు పాల్గొన్నారు.

# పాపన్న ఆశయ సాధనే మన బాట

**తెలంగాణ జాగృతిలో నివాళులర్పించిన పర్శరాములు గౌడ్**

కరీంనగర్, తిమ్మాపూర్ ఏప్రిల్ 02(అక్షరం న్యూస్)

బహుజన ఆత్మగౌరవ ప్రతీక, మొఘల్ సామ్రాజ్య ధిక్కార స్వరూపం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలను తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ బుదిగే పర్శరాములు గౌడ్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. కులమతాలకు అతీతంగా సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కోటలను జయించి, సామాన్యుడు కూడా పాలకుడు కావొచ్చని నిరూపించిన గొప్ప యోధుడు పాపన్న అని స్మరించుకున్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాపన్న గౌడ్ ఆశయాలను స్మరించుకున్నారు.



## రామాయణ టీజర్ విడుదల




రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్ గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు.దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.

## ఏడేళ్ల కల సాకారం కాబోతోంది

**రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ**



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమం లో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.

## 515 మిలియన్ల వ్యూయర్షిప్‌తో కొత్త రికార్డు..!

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ గ్రాండ్ గా మొదలైంది. పది టీమ్‌లతో జరుగుతున్న ఈ టోర్నమెంట్ మొదటి రెండు మ్యాచ్‌లే వ్యూయర్షిప్ పరంగా పాత రికార్డులన్నీ చెరిపేసాయి. బ్రాడ్‌కాస్టర్ జియోస్టార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కేవలం ఓపెనింగ్ వీకెండ్‌లోనే టీవీ, డిజిటల్ మాధ్యమాల్లో కలిపి ఏకంగా 51.5 కోట్ల మంది ఈ మ్యాచ్‌లను చూశారు. గత సీజన్ మొదటి రెండు మ్యాచ్‌లతో పోలిస్తే వాచ్-టైమ్ పరంగా 26 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం మీద 32.6 బిలియన్ నిమిషాల పాటు ఫ్యాన్స్ ఐపీఎల్ ఫీవర్‌లో మునిగిపోయారు. ఈసారి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ మీద వ్యూయర్షిప్ అదిరిపోయింది. కనెక్టెడ్ టీవీ రీచ్ సుమారు 30 శాతం పెరిగింది.

కాంకరెన్సీ (ఒకే సమయంలో చూసేవారు) ఏకంగా 61 శాతం మేర జంప్ అవ్వడం విశేషం. అటు లీనియర్ టెలివిజన్ (సాధారణ టీవీ) రంగంలో కూడా 24 శాతం టీవీఆర్ గ్రోత్ కనిపించింది. ఈ స్టార్ట్ చాలా ఎనర్జీ ఇచ్చిందని ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ సింగ్ ధుమాల్ పేర్కొన్నారు. క్వాలిటీ క్రికెట్ తో పాటు ఫ్యాన్స్‌కు అందిస్తున్న సరికొత్త ఎక్స్‌పీరియన్స్ వల్లే ఈ రిజల్ట్స్ వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సీజన్ సక్సెస్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్నది హిందీ ఫీడ్. రవిచంద్రన్ అశ్విన్, సురేష్ రైనా, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్, ఇర్ఫాన్ పఠాన్ వంటి మాజీ క్రికెట్ దిగ్గజాలు తమ విశ్లేషణలతో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. ఇది సాధారణ వీక్షణను ఒక అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్‌గా మార్చేసింది. ఐపీఎల్ క్రేజ్ రోజురోజుకూ పెరుగుతోందని, ఆధునిక ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్లుగా లీగ్ రూపాంతరం చెందుతోందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపారు. గ్రౌండ్‌లో ప్లేయర్స్ చేసే రన్ చేజ్ లు, హై-స్కోరింగ్ గేమ్స్ బ్రాడ్‌కాస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జియోస్టార్ స్పోర్ట్స్ సీఈఓ ఇషాన్ ఛటర్జీ మాట్లాడుతూ.. టాటా ఐపీఎల్ 2026 రికార్డు స్థాయి ఎంగేజ్‌మెంట్ సాధించిందన్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers,
RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609